

26న రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ రాక



విశాఖపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఈ నెల 26న విశాఖపట్నం వస్తున్నారు. ఆ రోజున రెండు యుద్ధనౌకలు 'హిమగిరి', 'ఉదయగిరి'...ఆయన చేతులు మీదుగా నౌకాదళంలో చేరతాయి. ఈ రెండూ విశాఖపట్నం కేంద్రంగా సేవలు అందించనున్నాయి.

ఉద్యోగం.. ఉత్సాహం

డీఎస్సీ మెరిట్ జాబితాలు విడుదల

ఫలించిన నిరీక్షణ

- ఏడేళ్ల తరువాత ఉపాధ్యాయ పోస్టుల భర్తీ

నేడో, రేపో సెలక్షన్ జాబితా

- ఉమ్మడి జిల్లాలో 1,139 ఖాళీలు
- ఉక్కు నగరంలోని విమల విద్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలన
- ఎంఈవోలు, హెచ్ఎంలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ
- వేర్వేరు యాజమాన్యాల ఆధ్వర్యంలో పోస్టింగ్, కౌన్సెలింగ్



డీఎస్సీ పరీక్ష రాసేందుకు వెళ్తున్న అభ్యర్థులు (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి నిర్వహించిన డీఎస్సీ రాత పరీక్షా ఫలితాల వెల్లడి కావడంతో అభ్యర్థుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. డీఎస్సీ కోసం ఏడేళ్లుగా అభ్యర్థులు నిరీక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం గత ఏడాది నోటిఫికేషన్ జారీ చేసింది. దీనికి సంబంధించి ఈ ఏడాది జూన్‌లో నిర్వహించిన రాతపరీక్ష ఫలితాలు శుక్రవారం రాత్రి ప్రకటించింది.

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, మునిసిపల్, గిరిజన సంక్షేమ, జువెనైల్ శాఖల పరిధిలో 1,139 పోస్టుల భర్తీకి సంబంధించి సబ్జెక్టుల వారీగా మెరిట్ లిస్టులు విడుదల చేసింది. వీటితోపాటు జోనల్ స్థాయిలో చేపట్టనున్న బీసీ, ఎస్సీ గురుకులాలు, మోడల్ స్కూళ్లలో టీజీటీ, పీజీటీ పోస్టులు, ప్రిన్సిపాళ్ల నియామకాల్లో ఉమ్మడి జిల్లాలో పలువురికి అవకాశం దక్కనున్నది. ఉమ్మడి జిల్లాలో ఒకేసారి 1,139 మందికి ఉద్యోగాలు ... మిగతా 4వ పేజీలో

డీఎస్సీలో సత్తా చాటారు -6లో

గణితం టాపర్ విజయ్

- మూడు కేటగిరీల్లోనూ అతనే



ఎస్.రాయవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం వమ్మవరం అగ్రహారం గ్రామానికి చెందిన సుంకరణం విజయ్ ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టీజీటీ) కేటగిరీ...గణితంలో 87.33, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ) గణితంలో 78.5, స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) గణితంలో 94.67 మార్కులు సాధించి రాష్ట్ర టాపర్‌గా నిలిచారు. విజయ్ తండ్రి నాగార్జునశర్మ ఫొటోగ్రాఫర్ కాగా, తల్లి వెంకటలక్ష్మి గృహిణి. విజయ్‌కు చిన్నతనం నుంచి టీచర్ కావాలనే కోరిక ఉండేది.కష్టపడి చదివి డీఎస్సీలో ప్రథమ ర్యాంకు సాధించాడు. తాను స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించాలని అనుకుంటున్నట్టు తెలిపాడు.

విద్యా కుసుమం జ్యోత్స్న



చోడవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): చోడవరానికి చెందిన కురచా జ్యోత్స్న స్కూల్ అసిస్టెంట్ కేటగిరీ...హిందీలో 86.05 మార్కులతో ఉమ్మడి విశాఖ జిల్లా మొదటి స్థానం, రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానం సాధించింది. ఇక టీజీటీ విభాగంలో 88.05 మార్కులతో జోన్-1లో ప్రథమ స్థానం, రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంక్ సాధించింది. సాధారణ వ్యవసాయ కుటుంబానికి చెందిన నారాయణమూర్తి, వెంకటలక్ష్మి దంపతులు రెండవ కుమార్తె జ్యోత్స్న. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో లక్ష్యాన్ని సాధించగలిగానని తెలిపింది.

అడుగడుగునా అక్రమాలు

ఎంవీవీ ఎంకే ప్రాజెక్టుపై జీవీఎంసీకి టౌన్ సర్వేయర్ నివేదిక

- 26 సెంట్లు ప్రభుత్వ భూమి ఆక్రమించినట్టు నిర్ధారణ
- ప్రభుత్వ స్థలంలోని రోడ్డు కూడా కబ్జా చేసి అపార్టుమెంట్ నిర్మాణం
- నాలా పన్ను కట్టకపోయినా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇచ్చేసిన టౌన్‌ప్లానింగ్ అధికారులు
- కోర్టులో బిల్డర్ కేసు వేసినా కౌంటర్ దాఖలుచేయని జీవీఎంసీ అధికారులు
- ఆ భవనం జోలికివెళ్లొద్దంటూ ఇటీవల న్యాయస్థానం ఆదేశం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కూర్మన్నపాలెంలో నిర్మించిన ఎంవీవీ-ఎంకే పార్క్ ప్రాజెక్టులో అక్రమాలు వాస్తవమేనని జీవీఎంసీ టౌన్ సర్వేయర్ నిర్ధారించారు. ఈ మేరకు నివేదికను రెండు రోజుల క్రితం మేయర్ పీలా శ్రీనివాసరావుకు అందజేశారు. ఎంవీవీ, ఎంకే పార్క్ అపార్టుమెంట్‌కు సెమీ బల్క్ నీటి కనెక్షన్ ఇచ్చే అంశంపై రెండు నెలల కిందట జరిగిన కౌన్సిల్ సమావేశంలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా ప్రాజెక్టులో అనేక అక్రమాలు జరిగాయని, బిల్డర్ జీవీఎంసీ, రెవెన్యూ ఆదాయానికి గండి కొట్టినందున వాటిపై విచారణ జరపాలని 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ డిమాండ్ చేశారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను మేయర్ పీలా శ్రీనివాసరావు ఆదేశించారు. టౌన్‌సర్వేయర్ విచారణ జరపగా ఉల్లంఘనలు వాస్తవమేనని నిర్ధారణ అయింది.



జీవీఎంసీ జోన్-6 (గాజువాక) 86వ వార్డు పరిధి కూర్మన్నపాలెం సర్వే నంబర్ 58/3పి, 59/1బి పార్టు, 52/5సీ, 60/1పిలోని 9.56 ఎకరాల్లో జీ+9 తరహా అపార్టుమెంట్ నిర్మాణానికి మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మరో వ్యక్తి కలిపి ప్లాన్ కోసం జీవీఎంసీకి 2019లో దరఖాస్తు చేసుకున్నారు. కొన్నాళ్ల కిందట భవన నిర్మాణం పూర్తవడంతో సెమీ బల్క్ నీటి కనెక్షన్ ఇవ్వాలంటూ నివాసితులు జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు దీనికోసం అంచనాలు తయారుచేసి పైప్‌లైన్ నిర్మాణం కోసం కొంత డబ్బు చెల్లించాల్సి ఉంటుందని చెప్పడంతో ఆ మేరకు కట్టేశారు. సెమీ బల్క్ కనెక్షన్ ఇవ్వాలంటే జీవీఎంసీ కౌన్సిల్ ఆమోదం తప్పనిసరి కావడంతో నీటి సరఫరా విభాగం అధికారులు ప్రతిపాదన తయారుచేసి రెండు నెలల కిందట జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకునేలా అజెండాలో చేర్చారు. కౌన్సిల్‌లో దీనిపై చర్చ సందర్భంగా 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ ఆ ప్రాజెక్టులో అనేక ఉల్లంఘనలు జరిగాయని, నాలా కట్టకపోయినా ప్లాన్‌తోపాటు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేసేశారని, రైవాడ కాలువ బఫర్ జోన్, శ్మశానం కబ్జా చేసి అపార్టుమెంట్ నిర్మించారని దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన మేయర్ పీలా శ్రీనివాసరావు ఆ ప్రాజెక్టుకు సంబంధించిన అనుమతులు, ఉల్లంఘనలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక అందజేయాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. జోన్-6 టౌన్ సర్వేయర్ దీనిపై సమగ్ర విచారణ జరిపారు.

ప్లాన్ దరఖాస్తుతోపాటు అపార్టుమెంట్ నిర్మించనున్న భూమికి సంబంధించి 9.59 ఎకరాలకు మాత్రమే ఓనర్‌షిప్ డీడ్‌లను సమర్పించారు. కానీ ప్రాజెక్టు మాత్రం 9.85 ఎకరాల్లో నిర్మించినట్టు టౌన్ సర్వేయర్ విచారణలో గుర్తించారు. సర్వే నంబర్ 55పీలోని 26 సెంట్ల ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణం చేపట్టారని నివేదికలో సర్వేయర్ పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ రికార్డుల్లో రోడ్డుగా గుర్తించిన భూమిని కూడా ఆక్రమించినట్టు నిర్ధారించారు. ప్లాన్‌కు దరఖాస్తు చేసినప్పుడే సుమారు రూ.9 కోట్లు నాలా కింద రెవెన్యూ అధికారులకు చెల్లించాల్సి ఉన్నప్పటికీ ఆ మొత్తాన్ని చెల్లించలేదని పేర్కొన్నారు. భవన నిర్మాణం పూర్తయిన తర్వాత ఆక్యుపేషన్ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసేలోపు ఆ మొత్తాన్ని చెల్లించాలని బిల్డర్‌కు నోటీసు ఇవ్వడంతోపాటు ప్లాన్ రిమార్కుల్లో పొందుపరిచినా, ఇప్పటికీ కట్టలేదని సర్వేయర్ వివరించారు. నాలా మొత్తాన్ని రెవెన్యూ శాఖకు కట్టించిన తర్వాతే ఓసీ ... మిగతా 4వ పేజీలో

డిగ్రీ కాలేజీల్లో

ముఖ ఆధారిత హాజరు

- ఏయూ నిర్ణయం
- అక్రమాలకు చెక్ చెప్పేందుకే...
- తరగతులకు హాజరు కాని విద్యార్థులు నుంచి ఫీజు పేరిట డబ్బులు వసూలుచేసి పరీక్షలకు అనుమతిస్తున్న కొన్ని కళాశాలల యాజమాన్యాలు
- అదో వ్యాపారంగా మారినట్టు అధికారుల గుర్తింపు
- అందుకే ఈ నెల 30కల్లా బయోమెట్రిక్ మెషీన్లు ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశాలు
- వర్సిటీ నుంచే పర్యవేక్షణ

విశాఖపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి):



ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలోని కొన్ని డిగ్రీ కళాశాలల్లో జరుగుతున్న అక్రమాలకు చెక్ చెప్పేందుకు అధికారులు నడుంబిగించారు. అనేక కాలేజీల్లో విద్యార్థులు తరగతులకు హాజరు కాకపోయినా వారి నుంచి భారీమొత్తంలో అదనపు ఫీజులు వసూలు చేస్తూ పరీక్షలకు అనుమతిస్తున్నారు. ఈ విషయం వర్సిటీ అధికారుల దృష్టికి వచ్చింది. అందుకే డిగ్రీ కాలేజీల్లో తప్పనిసరిగా బయోమెట్రిక్ మెషీన్లు ఏర్పాటు చేయాల్సిందిగా ఉత్తర్వులు జారీచేశారు. బయోమెట్రిక్ మెషీన్ల ద్వారా ముఖ ఆధారిత హాజరు (ఎఫ్ఆర్ఎస్) వేసేలా చర్యలు తీసుకుంటున్నారు. తద్వారా విద్యార్థులు తరగతులకు హాజరవుతున్నదీ.?, లేనిదీ?...వర్సిటీ నుంచే అధికారులు పర్యవేక్షించనున్నారు. ఇది విద్యార్థులకు, అదేవిధంగా అధిక మొత్తంలో ఫీజులు వసూలుచేసే కాలేజీ యాజమాన్యాలకు చెక్ చెప్పేందుకు ఉపకరిస్తుందని వర్సిటీ అధికారులు చెబుతున్నారు.

అక్రమాలకు చెక్..

ఏయూ పరిధిలో 190 డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. వాటి పరిధిలో ఏటా సుమారు 30 నుంచి 35 వేల మంది చేరుతుంటారు. ఇతర వ్యాపకాలతో ఎంతోమంది తరగతులకు ఎగనామం పెడుతుంటారు. అటువంటి విద్యార్థుల నుంచి కాలేజీ యాజమాన్యాలు మూడు వేల నుంచి రూ.7 వేల వరకు వసూలుచేసి పరీక్షలకు హాజరయ్యే అవకాశాన్ని కల్పిస్తున్నాయి. కాలేజీ యాజమాన్యాలకు ఇదో వ్యాపారంగా మారింది. కొన్ని కాలేజీలు అయితే ప్రత్యేకంగా విద్యార్థులతో ముందే ఈ తరహా లావాదేవీలను మాట్లాడుకుంటున్నాయి. కాలేజీలకు రాకపోయినా హాజరు ఉండేటట్టు చూస్తామని, అందుకు కొంత చెల్లించాల్సి ఉంటుందని చెబుతున్నాయి. దీంతో అటువంటి కాలేజీల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపిస్తున్నారు. దీనిని గుర్తించిన ఏయూ అధికారులు బయోమెట్రిక్ హాజరును తీసుకువచ్చారు. ఇదేకాకుండా ఏయూ అఫ్లియేషన్ లేకపోయినా కొన్ని కాలేజీల్లో అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. ఆ తరువాత సదరు విద్యార్థులను అఫ్లియేషన్ ఉన్న మరో కాలేజీలకు పంపుతున్నారు. ఈ తరహా అక్రమాలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని అధికారులు గుర్తించారు. అటువంటి వాటికి కూడా ఎఫ్ఆర్ఎస్ విధానంతో బ్రేక్ పడుతుందని ఏయూ అధికారులు చెబుతున్నారు.

తప్పనిసరిగా అమలు చేయాలి..

బయోమెట్రిక్ మెషీన్లు ఏర్పాటు ... మిగతా 4వ పేజీలో

స్టీల్‌ప్లాంటులో మరో 468 మందికి వీఆర్ఎస్

- యాజమాన్యం నిర్ణయం
- ఇప్పటికే ఉద్యోగుల కొరత...12 గంటల డ్యూటీ చేయాల్సిన పరిస్థితులు
- వందలాది మందిని తొలగిస్తే ఎలాగనే ప్రశ్నలు
- మరో వైపు తగ్గిపోతున్న ఉత్పత్తి
- పట్టించుకోని ప్రభుత్వాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

స్టీల్ ప్లాంటు యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తోంది. ఉద్యోగులు, కాంట్రాక్టు వర్కర్లను తగ్గించుకుంటూ పోతోంది. తాజాగా రెండో విడత ప్రకటించిన స్వచ్ఛంద పదవీ విరమణ పథకానికి శనివారం ఆమోదం తెలిపింది. వీఆర్ఎస్‌కు 1,150 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 997 మందిని అర్హులుగా గుర్తించారు. అందులో 468 మందికి వీఆర్ఎస్ ఇస్తున్నట్టు శనివారం ప్రకటించారు. ఆ జాబితాలో 69 మంది ఎగ్జిక్యూటివ్‌లు ఉండగా మిగిలిన 399 మంది నాన్ ఎగ్జిక్యూటివ్‌లు. దీనికి సంబంధించిన సమాచారాన్ని ఆయా ఉద్యోగుల మెయిళ్లకు వ్యక్తిగతంగా పంపించారు.

సుమారు పది వేల మంది వరకు ఉన్న ఉద్యోగుల సంఖ్యను 7,500కు తీసుకురావాలనే లక్ష్యంతో యాజమాన్యం దశల వారీగా చర్యలు చేపడుతోంది. వీఆర్ఎస్-1లో 1,140 మందిని ఇంటికి పంపించారు. ఇప్పుడు మరో 468 మంది సెప్టెంబరు నుంచి ఆగిపోతారు. వీరు కాకుండా నెలకు 60 నుంచి 80 మంది పదవీ విరమణ చేస్తున్నారు. దీంతో ఉద్యోగుల సంఖ్య భారీగా తగ్గిపోతోంది.



అటు చూస్తే మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు ఆపరేట్ చేస్తూ 100 శాతం ఉత్పత్తి తీయాలంటూ ఒత్తిడి పెడుతున్నారు. ఉద్యోగుల పని గంటలను పెంచారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ 12 గంటలు డ్యూటీ చేయిస్తున్నారు. సహాయంగా అందుబాటులో ఉండాల్సిన కాంట్రాక్టు వర్కర్లను తగ్గించేశారు. దాంతో ఏ విభాగంలోను పనులు పూర్తిస్థాయిలో జరగడం లేదు. ఉత్పత్తి అనుకున్న స్థాయిలో ... మిగతా 4వ పేజీలో

లైమ్ స్టోన్ సరఫరాలో అడ్డంకులు

- కన్వేయర్ల వద్ద తగినంత మంది సిబ్బంది లేకపోవడమే కారణం

విశాఖపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులోని రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంటు (ఆర్ఎంహెచ్‌పీ)లో కన్వేయర్ల పరిస్థితి రోజురోజుకూ మరింత దయనీయంగా మారుతోంది. లైమ్ స్టోన్‌ను సరఫరా చేసే కన్వేయర్ వద్ద కాంట్రాక్టు కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఇక్కడ మొత్తం 41 మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేయాల్సి ఉండగా, కేవలం 14 మందిని మాత్రమే ఉన్నారు. అంటే తీవ్రమైన మానవ వనరుల కొరత ఏర్పడింది. అవసరమైనంత మంది ఉంటే స్పిల్ అయిన (కిందపడిన) మెటీరియల్‌ను వెంటవెంటనే క్లియర్ చేస్తారు. అంతమంది లేకపోవడంతో స్టీల్ మెల్ట్ షాప్(ఎస్ఎంఎస్)కు అందాల్సిన లైమ్ స్టోన్ సరఫరా 65 శాతం పడిపోయింది. స్టీల్ తయారీలో లైమ్ స్టోన్ చాలా కీలకం. స్టీల్‌లో మలినాలను తొలగించడం, నాణ్యతను మెరుగుపరచడంలో ... మిగతా 4వ పేజీలో

నగరంలో నకిలీ మద్యం

విదేశీ బ్రాండ్ల పేరుతో అమ్మకం

- నిబంధనలకు విరుద్ధంగా డిఫెన్స్ సరకు కూడా అమ్మకం
- క్యాంటీన్‌లో తీసుకుని దళారుల ద్వారా బయట విక్రయించుకుంటున్న కొంతమంది ఉద్యోగులు
- ఇటీవల ఎక్సైజ్ శాఖ దాడుల్లో భారీగా స్వాధీనం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో డిఫెన్స్, నకిలీ విదేశీ మద్యం విక్రయాలు పెరుగుతున్నాయి. సులభంగా డబ్బులు సంపాదించవచ్చునే ఉద్దేశంతో కొందరు దళారుల ద్వారా సరుకు సంపాదించి గుట్టుగా అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ తరహా ముఠాలను గత కొద్దిరోజులుగా ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నారు.




ఉక్కు అధికారి నివాసంలో స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

తూర్పు నౌకాదళం ప్రధాన కార్యాలయం నగరంలో ఉండడంతో రక్షణ శాఖలో పనిచేసేవారి సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. ఉద్యోగులకు రక్షణ శాఖ క్యాంటీన్ ద్వారా నిత్యావసర సరకులు, గృహోపకరణాలతోపాటు మద్యం కూడా సబ్సిడీపై అందుబాటులో ఉంచుతారు. కొంతమంది ఉద్యోగులు తమ కోటా మద్యాన్ని క్యాంటీన్ నుంచి విడిపించుకుని ఇతరులకు అధిక ధరకు విక్రయిస్తుంటారు. అలాంటి వారిని దళారులు గుర్తించి వారి కోటా మద్యాన్ని విడిపించి, సొమ్ము చేసుకుంటున్నారు. డిఫెన్స్ మద్యాన్ని ఎంత మొత్తమైనా పెట్టి కొనేందుకు కొందరు సిద్ధపడుతుంటారు. అలాగే విదేశీ మద్యం పేరుతో కొందరు నకిలీ మద్యాన్ని విక్రయిస్తున్నారు. నగరంలో ఈ తరహా వ్యాపారం ఇటీవల కాలంలో విపరీతంగా పెరిగిపోవడంతో నగరంలో మద్యం విక్రయాలపై ప్రభావం పడుతోందని ఎక్సైజ్ శాఖ అధికారులు గుర్తించారు. దీనికి అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక నిఘా పెట్టి దాడులు తీవ్రతరం చేశారు. ఈనెల 19న గాజువాకలోని ఓ ఫర్నీచర్ దుకాణంలో డిఫెన్స్ మద్యం విక్రయిస్తున్నట్టు సమాచారం అందడంతో ఎక్సైజ్ శాఖ అధికారులు దాడి ... మిగతా 4వ పేజీలో

29న ముఖ్యమంత్రి రాక

- డబుల్ డెక్కర్ బస్సుల ప్రారంభం
- వీఎంఆర్‌డీఏ ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం
- జాతీయ క్రీడా దినోత్సవం, అధికార భాషా దినోత్సవానికి హాజరు



విశాఖపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 29వ తేదీన నగరానికి రానున్నారు. ఆరోజు ఉదయం 11 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని నేరుగా నోవాటెల్ హోటల్‌కు వెళతారు. అక్కడ ఏర్పాటుచేసే కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం పర్యాటక శాఖకు చెందిన డబుల్ డెక్కర్ బస్సులు, వీఎంఆర్‌డీఏ చేపట్టిన ప్రాజెక్టులు ... మిగతా 4వ పేజీలో

విశాఖ విమల విద్యాలయం మూసివేత

- ఆర్‌సీఎం సొసైటీ ప్రకటన

విశాఖపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): విశాఖ విమల విద్యాలయం మూతపడింది. ఇదే విషయాన్ని విద్యాలయాన్ని నడుపుతున్న ఆర్‌సీఎం సొసైటీ నోటీసు బోర్డులో పెట్టింది. ఈ ఏడాది తరగతులు పునఃప్రారంభం లేదని స్పష్టంచేసింది. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించింది. కొన్ని దశాబ్దాలుగా నడుస్తున్న ఈ విద్యాలయంలో 1,700 మంది పిల్లలు చదువుతుండగా సంస్థ నిర్వహణకు నిధులు ఇవ్వలేమని స్టీల్ ప్లాంటు యాజమాన్యం చేతులు ఎత్తేసిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా విద్యా సంస్థను సొసైటీకి లీజుకు ఇచ్చే అగ్రిమెంట్‌ను పునరుద్ధరించలేదు. దాంతో సొసైటీ జిల్లా విద్యాశాఖాధికారికి దరఖాస్తు చేయడానికి అవకాశం లేకుండా పోయింది. గత రెండేళ్లుగా ఇదే జరుగుతుండడంతో ఈసారి ... మిగతా 4వ పేజీలో

డబుల్ డెక్కర్ బస్సు టికెట్ కౌంటర్ ఏర్పాటు

సాగర్‌నగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బ్యాటరీ ఆధారిత డబుల్ డెక్కర్ బస్సు టికెట్ కౌంటర్‌ను రుషికొండ బీచ్ మెరైన్ వాచ్ టవర్‌లో ఏర్పాటు చేస్తున్నారు. నగర అందాలు పర్యాటకులను మరింతగా ఆకట్టుకునేలా గ్రేటర్ విశాఖ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులో రెండు బ్యాటరీ డబుల్ డెక్కర్ బస్సులను అందుబాటులోకి తీసుకువస్తున్న విషయం తెలిసిందే. ఈ బస్సుల్లో ప్రయాణించేవారు తొలుత వాచ్ టవర్‌లో ఏర్పాటు చేయనున్న కౌంటర్‌లో టికెట్ తీసుకోవాల్సి ఉంది. త్వరలోనే టికెట్ కౌంటర్‌ను ప్రారంభించనున్నట్టు తెలిసింది.

స్కేటింగ్ పోటీల్లో చిన్నారుల ప్రతిభ

మధురవాడ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని మిథిలాపురి వుడాకాలనీలో ఉన్న కేఆర్‌ఎస్‌పి స్కేటింగ్ అకాడమీ చిన్నారులు నగరంలోని వుడా పార్కు స్కేటింగ్ రింక్‌లో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపారు. ఈమేరకు అకాడమీ కోచ్ వి. రవికుమార్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

అదనపు సచివాలయం ఏర్పాటు చేయాలి

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని రేఖవానిపాలెం పంచాయతీలో ఐదు వేల మంది జనాభా ఉండడంతో అదనంగా మరో సచివాలయం ఏర్పాటు చేయాలని కూటమి నాయకులు కోరారు. ఈమేరకు శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక సచివాలయం ఉండడం వల్ల సిబ్బంది పని భారంతో ఇబ్బంది పడుతున్నారని, పథకాల అమలులో కూడా జాప్యం జరుగుతుందన్నారు. అదనపు సచివాలయం ఏర్పాటు చేయాలని లేదా ఉన్న సచివాలయంలో అదనపు సిబ్బందిని నియమించాలని విన్నవించారు.

జన్యు పరిజ్ఞానంపై వైద్యులకు అవగాహన

ఎండాడ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్‌సర్) అనాటమీ విభాగం ఆధ్వర్యంలో మానవ జన్యు పరిజ్ఞానంపై వైద్యులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన 21 వైద్య కళాశాలల నుంచి వైద్యులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిమ్‌సర్ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి. గీతాంజలి, డీన్ డాక్టర్ ఎస్వీ రావు, ఎన్‌ఆర్‌ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డీన్ డాక్టర్ సుధాకర్, జిమ్‌సర్ అనాటమి విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్యామ్యూల్ ఫ్రాంక్ స్టీఫెన్, తదితరులు పాల్గొన్నారు.

సురవరం సుధాకర్‌రెడ్డి మృతి పట్ల నివాళి

తగరపువలస, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : వామపక్షాల జాతీయ నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి మృతి పట్ల పలువురు నాయకులు నివాళి అర్పించారు. శనివారం స్థానిక జీఆర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, చిల్ల రామపైడయ్య, ఆదినారాయణ, సన్నిబాబు, గోవిందరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

భీమిలి బీచ్‌లో ఉధృతంగా కెరటాలు

భీమునిపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : భీమిలి బీచ్‌లో సముద్ర కెరటాలు ఉధృతంగా తీరానికి దూసుకువచ్చాయి. శనివారం అమావాస్య కావడంతో శుక్రవారం అర్ధరాత్రి నుంచే సముద్రం పోటు ఎక్కువగా ఉందని మత్స్యకారులు తెలిపారు. గతంతో పోల్చితే కెరటాలు ఉధృతంగానే కనిపించాయి. దీంతో భోయవీధి, నోవాటెల్ వద్ద తీరం కోతకు గురవుతోంది.


భోయవీధి వద్ద కెరటాల ఉధృతి

అక్రమ నిర్మాణం తొలగింపు

భీమునిపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) :ప్రభుత్వ పాఠశాల భవనాన్ని ఆనుకుని నిర్మిస్తున్న ఇంటి స్లాబ్‌ను జీవీఎంసీ అధికారులు శనివారం తొలగించారు. 4వ వార్డు చేపలుప్పాడలో ఇల్లు నిర్మిస్తున్న వ్యక్తి పాఠశాల భవనం లోపలికి స్లాబ్ భాగాన్ని పెంచి పనులు చేపట్టారు. ఈ విషయమై ఆ గ్రామ జనసేన నాయకుడు పీజీఆర్‌ఎస్‌లో జడ్డీ అయ్యప్పనాయుడుకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పట్టణ ప్రణాళికా విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్ రామకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది పాఠశాలను సందర్శించి, ఆక్రమిత భాగాన్ని తొలగించారు.

ఆనందపురం కేజీబీవీలో ప్రకృతి పథ్

సాగర్‌నగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఆనందపురం కేజీబీవీలో గీతం వర్సిటీ విద్యార్థులు శనివారం ప్రకృతి పథ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షణా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ జె. చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

ఆనందపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : గిడిజాల పంచాయతీలో ఉన్న సాయిగణపతి పాలిటెక్నిక్ కళాశాలలో వ్యక్తిత్వ వికాసంపై శనివారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సుధీర్ సంద్ర మాట్లాడుతూ విద్యార్థులు చదువులో భయాన్ని అధిగమించి, లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు.

డిగ్రీ కాలేజీల్లో ముఖ ఆధారిత హాజరు

... 3వ పేజీ తరువాయి

చేయాలంటూ ఏయూ అధికారులు ఈ నెల 22న అనుబంధ డిగ్రీ కాలేజీల ప్రిన్సిపాల్స్, సెక్రటరీలు, కరస్పాండెంట్లకు సర్క్యులర్ విడుదల చేశారు. ఈనెల 30లోగా మెషీన్లు ఇన్‌స్టాల్ చేయాలని స్పష్టం చేశారు. మెషీన్లు ఏర్పాటు చేయడంతోపాటు వాటిని యూనివర్సిటీ నుంచి మానటరింగ్ చేసేందుకు అనుగుణమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సర్క్యులర్‌ను అత్యవసరంగా భావించాలని సీడీసీ డీన్ పేరుతో వెలువడిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

29న ముఖ్యమంత్రి రాక

... 3వ పేజీ తరువాయి

ప్రారంభిస్తారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి హాజరవుతారు. అనంతరం ప్రో కబడ్డీ పోటీలు ప్రారంభిస్తారు. అలాగే గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే అధికార భాషా దినోత్సవంలో పాల్గొంటారు. ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమాలు ఇంకా అధికారికంగా ఖరారు కావల్సి ఉంది. సీఎం పర్యటించే ప్రాంతాలను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, ఇతర అధికారులు శనివారం పరిశీలించారు. అనంతరం వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, జేసీ మయూర్‌అశోక్, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, ఏయూ అధికారులతో సమీక్షించారు.

విశాఖ విమల విద్యాలయం మూసివేత

... 3వ పేజీ తరువాయి

విద్యార్థుల తల్లిదండ్రులు ముందుగానే మేల్కొన్నారు. పునఃప్రారంభం కోసం ఎదురుచూస్తే పిల్లల భవిష్యత్తు పోతుందని అత్యధికులు పిల్లలను ఇతర పాఠశాలల్లో చేర్పించారు. మొత్తం 1,700 మందిలో ఇప్పటికే 1,630 మంది బదిలీ సర్టిఫికెట్లు తీసుకుని వెళ్లిపోయారు. ఇంకా 70 మంది మాత్రమే మిగిలారు. వారికి ప్రైవేటు పాఠశాలల్లో చదివించే స్థోమత లేకపోవడంతో ఉండిపోయారు. పాఠశాల తెరుస్తారేమోనని ఆశించారు. కానీ ఈఏడాది సాధ్యం కాదని తాజాగా సొసైటీ నోటీసు పెట్టడంతో ఇప్పుడు వారు కూడా ఎక్కడో ఓ చోట చేరాల్సి ఉంది. వారికి టీసీలు ఇవ్వడానికి సొసైటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.


వరాహ పుష్కరిణి వద్ద మొక్క నాటుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, పక్కన మేయర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్


పద్మనాభంలోని రేవిడిలో స్వచ్ఛతా ర్యాలీ

ప్రజా సహకారంతోనే ఆరోగ్యాంధ్రప్రదేశ్

- మేయర్ పీలా శ్రీనివాసరావు
- సింహాచలంలో 'స్వచ్ఛాంధ్ర'

సింహాచలం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సహకారంతోనే ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధ్యమని జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. శనివారం సింహాచలం వరాహ పుష్కరిణి వద్ద స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మేయర్‌తో పాటు కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, 98వ వార్డు కార్పొరేటర్ నరసింహం, సింహాచలం దేవస్థానం ఈఓ త్రినాథరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ఎక్కడా నీటి నిల్వలు లేకుంటా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పుష్కరిణి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా దేవస్థానం అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ అధికారులు, ప్రజలు పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టిసారించి, దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దేవస్థానం పరిధిలో భక్తులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని ఈఓను ఆదేశించారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నగర పరిశుభ్రతకు, ప్రజల ఆరోగ్య సంరక్షణకు దోహదపడుతుందన్నారు. వినాయక చవితి సందర్భంగా ప్రతిఒక్కరూ మట్టి ప్రతిమలనే పూజించాలని కోరారు. బీఆర్‌టీఎస్ నిర్మాణంలో బాధితులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. కాగా భక్తుల అవసరాలకు తగినట్టుగా పుష్కరిణిని అభివృద్ధి చేయాలని ఈఓ త్రినాథరావు అధికారులను కోరారు. అనంతరం స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేశారు. అలాగే పుష్కరిణి ఒడ్డున మొక్కలు నాటారు.


భీమిలి ప్రభుత్వ సీహెచ్‌సీలో సిబ్బంది ర్యాలీ

పుష్కరిణిలో దోమల నివారణకు గంబూషియా చేపలను వదిలారు. నేషనల్ సఫాయి కర్మచారి ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆర్థిక సహకారంతో రాయితీపై కొనుగోలు చేసిన జేసీబీ, 2 చైన్ మౌంటెడ్ మిషన్ జేఎస్ 81 వాహనాలను లబ్ధిదారులకు మేయర్ అందజేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తి, యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యవేణి, జోన్-8 కమిషనర్ హేమావతి, డీడీహెచ్‌ఎం దామోదరరావు, ఈఈ దిలీప్, ఏసీపీ రామలింగేశ్వరరావు, బయాలజిస్టు సాంబమూర్తి, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి, వార్డు టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. కాగా వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయ అధికారులు స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రధాన రాజగోపురం ఎదురుగా ఉన్న మాడవీధిలో శుభ్రం చేశారు.దేవస్థానం డిప్యూటీ ఈఓ రాధ సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దేవాలయ ఏఈఓ కె. తిరుమలేశ్వరరావు, పారిశుధ్య విభాగం ఏఈఓ పంతం శ్రీనివాస్, ఆలయ పర్యవేక్షణాధికారి త్రిమూర్తులు, ఆలయ ప్రజా సంబంధాల అధికారి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

భీమిలిలో..

భీమునిపట్నం : పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం, డిగ్రీ కళాశాలలో వేర్వేరుగా స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు.

పద్మనాభంలో..

పద్మనాభం : మండలంలోని రేవిడిలో జరిగిన కార్యక్రమంలో ప్రత్యేకాధికారి కె. జ్ఞానవేణి మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించి, నీరు లేకుండా చేయాలన్నారు. దోమల నివారణకు పంచాయతీలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పద్మనాభంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ర్యాలీ నిర్వహించి, మండల పరిషత్ కార్యాలయం పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె. దామోదరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు రమణ, ఏఓ జయ ఉమ, డిప్యూటీ ఎంపీడీఓ మీనాకుమారి,ఆర్‌ఐ శ్యామల, ఎంపీటీసీ సభ్యుడు సూరప్పడు, తదితరులు పాల్గొన్నారు.

తగరపువలసలో...

తగరపువలస : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీవాణి మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం కొండపేట, శివాలయం వీధి ప్రజలకు సీజనల్ వ్యాధుల గురించి వివరించారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

విశాలాక్షినగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : తెన్నేటి పార్కు వెనుక ఉన్న తీరంలో శనివారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభించింది. ఆరిలోవ ఎస్‌ఐ వై. కృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. పార్కు సమీపంలోని తీరంలో సుమారు 45 నుంచి 50 ఏళ్ల వయస్సు ఉన్న మహిళా మృత దేహం ఉందని స్థానికులు సమాచారం ఇచ్చారన్నారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించామని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

యువకుడి ఆత్మహత్య

సాగర్‌నగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఫైనాన్స్ కంపెనీలో సేల్స్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న సంపత్ వినాయకరెడ్డి (27) రుషికొండలోని ఓ లాడ్జిలో బెడ్ షీట్‌తో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి గొర్లె శంకర్‌రామ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పీఎం పాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దొండపర్తి ప్రాంతానికి చెందిన సంపత్‌వినాయకరెడ్డి శనివారం ఉదయం ఉద్యోగానికి వెళ్లి సాయంత్రం ఇంటికి రాకపోవడంతో తండ్రి పలుసార్లు అతని సెల్‌కు ఫోన్ చేశాడు.ఎంత ప్రయత్నించినా అటు నుంచి స్పందన లేకపోవడంతో సంపత్‌వినాయకరెడ్డి సహ ఉద్యోగికి ఫోన్ చేయగా ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరికి పతకాలు



సాగర్‌నగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : జమ్మూ కశ్మీర్‌లోని శ్రీనగర్‌లో ఇటీవల జరిగిన ఖేలో ఇండియా వాటర్ స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో నగరానికి చెందిన ఇద్దరు చిన్నారులు నాగిడి గాయత్రి, రాజేశ్ పతకాలు సాధించారు. ఈమేరకు ఆంధ్రప్రదేశ్ కెనోయింగ్, కయాకింగ్ అసోసియేషన్ శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది.

స్టీల్ ప్లాంటులో మరో 468 మందికి వీఆర్‌ఎస్

... 3వ పేజీ తరువాయి

రావడం లేదు. రోజుకు 21 వేల టన్నుల ఉత్పత్తి లక్ష్యం కాగా శుక్రవారం (22న) మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు కలిపి 6,160 టన్నులు మాత్రమే హాట్ మెటల్ తీశారు. ఇది లక్ష్యంలో మూడో వంతు కూడా లేదు. ఇందులో ఉద్యోగుల తప్పిదం, అలసత్వం ఏమీ లేదు. కేవలం యాజమాన్యం తప్పుడు నిర్ణయాలు, సిబ్బందిని కుదించడం వల్లే ఇలా జరుగుతోంది. ఈ విషయాన్ని కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ గుర్తించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇన్‌చార్జి సీఎండీ సక్సేనా చెప్పిన మాటలనే విశ్వసిస్తోంది. ఇది ఉక్కు ఉద్యోగులు-రాష్ట్ర ప్రభుత్వం మధ్య అంతరం పెంచుతోంది. ఉక్కు యాజమాన్యం నిర్ణయాలపై కూటమి నాయకులు కూడా సమాధానం చెప్పుకోలేకపోతున్నారు. ప్రైవేటీకరణ జరగదని మాత్రం చెబుతున్నారు. వాటిని ప్లాంటులో ఒక్కరు కూడా విశ్వసించడం లేదు.

ఘనంగా టంగుటూరి జయంతి

కొమ్మాది, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : నీతి, నిజాయతీ ప్రాణంగా బతికిన వ్యక్తి టంగుటూరి ప్రకాశం పంతులు అని కమాండెంట్ ఎం. అరుణ్‌బోస్ అన్నారు. శనివారం బక్కన్నపాలెం 16వ పోలీస్ బెటాలియన్‌లో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టి స్వతంత్ర సమర యోధుడిగా, ఆంధ్రరాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ ఎం. శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమాండెంట్‌లు, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న బెటాలియన్ సిబ్బంది

అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి


అధికారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి జ్ఞానవేణి

పద్మనాభం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ కాలనీ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని మండల ప్రత్యేకాధికారి కె. జ్ఞానవేణి అధికారులను ఆదేశించారు. రేవిడి గ్రామంలోని కాలనీ లేఅవుట్‌ను శనివారం ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలను వెంటనే పూర్తి చేయించి వినియోగంలోకి తీసుకువచ్చేలా గృహ నిర్మాణ శాఖాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని పీహెచ్‌సీని సందర్శించారు. రోగులకు అందిస్తున్న సేవల వివరాలను వైద్యాధికారి మణికుమారిని అడిగి తెలుసుకున్నారు. అలాగే జెడ్పీ పాఠశాలను కూడా సందర్శించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ మీనాకుమారి, హౌసింగ్ ఏఈ పద్మావతి, ఆర్‌ఐ శ్యామల, వైసీపీ నాయకుడు కోన రమణ, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

భీమునిపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరికి చట్టాలపై అవగాహన అవసరమని, అదే సమయంలో అట్రాసిటీ, పోక్సో చట్టాలను దుర్వినియోగం చేయడం సరికాదని భీమిలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మెజిస్ట్రేట్ డి. సౌజన్య అన్నారు. శనివారం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చట్టాలపై కనీస అవగాహన అవసరమన్నారు.భీమిలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్. జనార్దనరావు మాట్లాడుతూ హిందూ వివాహ చట్టాన్ని వివరిస్తూ, చట్టం ఔనత్యాన్ని పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకతను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ గౌరి, సీనియర్ న్యాయవాది ఎంవీ పార్వతీశం, బార్ అసోసియేషన్ కార్యదర్శి కె. మంజుల, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, న్యాయవాది బక్క గణేశ్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ సౌజన్య

సింహగిరిపై వైభవంగా అమావాస్య తిరువీధి


మాడవీధుల్లో స్వామివారి తిరువీధి

సింహాచలం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసం అమావాస్యను పురస్కరించుకుని వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో శనివారం తిరువీధి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం పవళింపుసేవ తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని, ఉభయదేవేరులను శోభాయమానంగా తీర్చిదిద్ది, పల్లకిలో ఉంచారు. ఆలయ పండితులు వేదమంత్రోచ్ఛారణలు, విద్వాంసుల నాదస్వరాలపనలు నడుమ స్వామివారి తిరువీధి జరిపారు. మార్గం పొడవునా అష్టదిక్పాలకులకు భక్తులు పూజలు చేశారు.

కమనీయం.. స్వామివారి నిత్య కల్యాణం

వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం శనివారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై ఉంచారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు.


ఎం. గౌరి


గొట్టిపల్లి లలిత


ఆశీర్వాదం


కోరాడ సురేఖ

తగరపువలసలో నలుగురికి ఎస్‌జీటీ పోస్టులు

తగరపువలస, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస పరిధిలో నలుగురు ఎస్‌జీటీ పోస్టులకు ఎంపికయ్యారు. గొట్టిపల్లి లలితకు 79.17 మార్కులతో 324 ర్యాంకు రాగా ఆమె బీసీ బి కేటగిరీలో ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఏడిద ఆశీర్వాదం 79.49 మార్కులతో 355 ర్యాంకు (బీసీ సి), ఎం. గౌరి 77. 07 మార్కులతో 444 ర్యాంకు (బీసీ ఏ), కోరాడ సురేఖ 87.77 మార్కులతో 38 ర్యాంకు (ఓపెన్ కేటగిరి) సాధించారు. వీరంతా నిరుపేద కుటుంబానికి చెందిన వారని శిక్షకుడు బి. నరసింగరావు తెలిపారు.

నాగార్జునసాగర్‌ను సందర్శించిన ఎమ్మెల్యే గంటా

నాగార్జునసాగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, సినీనటుడు అశోక్‌కుమార్ శనివారం నాగార్జునసాగర్‌ను సందర్శించారు. గంటాకు స్థానిక విజయ విహార్ అతిథి గృహంలో ప్రొటోకాల్ ఆర్‌ఐ దండా శ్రీనివాస్‌రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం ఆయన పల్నాడు జిల్లాలో ఉన్న ఎత్తిపోతల జలపాతాన్ని తిలకించారు. సాయంత్రం హిల్‌కాలనీలో బుద్ధవనం ప్రాజెక్టును సందర్శించారు. ఆదివారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణతో కలిసి సాగర్ డ్యామ్, జలాశయం మధ్యలో ఉన్న నాగార్జున కొండను సందర్శించనున్నారు.


గంటాకు స్వాగతం పలుకుతున్న ఆర్‌ఐ

పూల అలంకరణ పోటీలు

డాబాగార్డెన్స్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 31న రాధాష్టమి సందర్భంగా హరేకృష్ణ మూమెంట్ (విశాఖపట్నం) ఆధ్వర్యంలో రెండు విభాగాల్లో పూల అలంకరణ పోటీలు నిర్వహిస్తున్నట్టు సంస్థ వైస్ ప్రెసిడెంట్ యదురాజ దాస తెలిపారు. శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 12 నుంచి 16 ఏళ్లలోపు బాల బాలికల కోసం 30న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, 31న ఉదయం 10 నుంచి 12 గంటల మధ్య 16 సంవత్సరాలు దాటిన మహిళలకు పోటీలను హరేకృష్ణ వైకుంఠం ఐఐఎంరోడ్డు గంభీరంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనదలచినవారు పూల దండలు, పుష్పగుచ్ఛాలు మాత్రమే తయారు చేయవలసి ఉంటుందన్నారు. పోటీదారులు పూలను, సామగ్రిని వారే తెచ్చుకోవాలన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.40 వేలు, మూడో బహుమతి రూ.25 వేలను అందజేస్తామన్నారు. వివరాలకు 77990 06648 ఫోన్ నెంబరులో సంప్రదించాలని కోరారు.

ఉద్యోగం..ఉత్సాహం

... 3వ పేజీ తరువాయి

వస్తుండడంతో అభ్యర్థులు, వారి కుటుంబాల్లో ఆనందం వ్యక్తమవుతుంది. చంద్రబాబునాయుడు సీఎంగా ఉన్న సమయంలో 2018లో డీఎస్సీ నిర్వహించారని, ఆ తరువాత మళ్లీ ఇప్పుడు ఆయన హయాంలోనే పోస్టులు భర్తీ చేస్తున్నారని అభ్యర్థులు గుర్తుచేస్తున్నారు. ఒకేసారి పలు యాజమాన్యాల పరిధిలో ఖాళీలు భర్తీచేయడం చాలావరకు ఉపయోగపడిందని పలువురు వ్యాఖ్యానించారు. శుక్రవారం రాత్రి విడుదల చేసిన మెరిట్ జాబితాలో అభ్యర్థులకు వచ్చిన మార్కుల ప్రకారం ర్యాంకులు ప్రకటించారు. దాని ప్రాతిపదికగా రోస్టర్ పాయింట్లు ఉపయోగించి సెలక్షన్ జాబితా సిద్ధం చేస్తున్నారు. రోస్టర్ ఆధారంగా కటాఫ్ మార్కులు నిర్ణయించి ఆదివారం లేదా సోమవారం సెలక్షన్ జాబితా విడుదల చేయనున్నారు. సెలక్షన్ జాబితా మేరకు అభ్యర్థులకు కాల్ లెటర్స్ పంపించనున్నారు. కాల్ లెటర్ వచ్చిన అభ్యర్థులు మాత్రమే సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో జడ్పీ, మునిసిపల్, ప్రభుత్వ పాఠశాలలు, గిరిజన సంక్షేమ శాఖ, జువెనైల్ శాఖలలో పోస్టుల భర్తీ, జోన్ పరిధిలో గురుకులాల్లో టీజీటీ, పీజీటీ, ప్రిన్సిపాళ్ల నియామకాల కోసం అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన విద్యా శాఖ పరిధిలో జరగనున్నది. విశాఖ ఉక్కు నగరంలోని విమల విద్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలన చేస్తారు. సర్టిఫికెట్ల పరిశీలనలో పాల్గొనే ఎంఈవోలు, హెచ్‌ఎంలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శనివారం విశాఖ విమల విద్యాలయంలో శిక్షణ ఇచ్చారు. సర్టిఫికెట్ల పరిశీలన ఎప్పుడు జరిపేది ఆదివారం ప్రకటించనున్నారు. ఏ పోస్టుకు ప్రాధాన్యం ఇస్తున్నారో దరఖాస్తు చేసే సమయంలోనే అభ్యర్థులు ఆప్షన్ ఇచ్చారు. దీని ప్రకారం సదరు అభ్యర్థికి వచ్చిన మార్కుల ప్రాతిపదికగా పోస్టులో నియమిస్తారు. ఆ తరువాత ఆయా యాజమాన్యాలు ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగ్స్ ఇచ్చి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు పాఠశాల విద్యా శాఖ ఆర్జేడీ విజయభాస్కర్ తెలిపారు. కాగా ఉమ్మడి జిల్లాలో మెరిట్ జాబితా మేరకు ఏ ర్యాంకు వరకు పోస్టులు తీస్తారనే చర్చ అభ్యర్థుల్లో సాగుతుంది. దీనిపై రకరకాలుగా అభ్యర్థులు, నిపుణులు లెక్కలు కడుతున్నారు. అయితే ఏ ర్యాంకు వరకూ ఉద్యోగం గ్యారంటీ అనేది స్పష్టంగా చెప్పలేమని, అది పోస్టులను బట్టి ఉంటుందని విద్యా శాఖకు చెందిన ఒక అధికారి తెలిపారు. ఉదాహరణకు స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కేటగిరీలో 139 పోస్టులు ఉన్నాయి. అందులో సగం రిజర్వేషన్ కు వెళతాయి. దీనిని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా కటాఫ్‌కు దగ్గరగా ఉన్న వారిలో మాత్రం కొంత ఉత్కంఠ ఉందని, బహుశా ఆదివారం లేదా సోమవారం పూర్తిగా స్పష్టత వస్తుందని అన్నారు.

నగరంలో నకిలీ మద్యం

... 3వ పేజీ తరువాయి

చేయగా 108 బాటిళ్లు లభ్యమయ్యాయి. ఈనెల 14న సీతంపేటలోని ఒక ఇంట్లో విదేశీ మద్యం విక్రయిస్తున్నట్టు సమాచారం అందడంతో సోదాలు చేయగా 99 నకిలీ విదేశీ మద్యం సీసాలు దొరికాయి. నెల రోజుల కిందట మధురవాడలోని ఎంవీవీ సిటీలో ఉంటున్న స్టీల్‌ప్లాంటు ఏజీఎం ఫ్లాట్‌లో సోదాలు నిర్వహించి వివిధ రాష్ట్రాలకు చెందిన మద్యంతోపాటు నకిలీ విదేశీ మద్యం 67 సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే గత నెల ఏడున మల్కాపురంలోని ప్రకాష్‌నగర్‌లోని ఒక ఇంటిపై దాడి చేసి 220 డిఫెన్స్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్ వివరణ కోరగా డిఫెన్స్ మద్యం విక్రయం, కొనుగోలు...రెండూ నేరమేనన్నారు. ఆ విషయం చాలామందికి తెలియక కొనుగోలు చేస్తున్నారన్నారు. మద్యం కావాలనుకునేవారు లైసెన్స్‌డ్ దుకాణాల వద్దనే కొనుగోలు చేయాలన్నారు. హానికరమైన రసాయనాలతో తయారుచేసిన నకిలీ మద్యం సేవిస్తే ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుందన్నారు. నగరంలో డిఫెన్స్, విదేశీ నకిలీ మద్యం పేరుతో జరుగుతున్న విక్రయాలపై ప్రత్యేక సమాచార వ్యవస్థను ఏర్పాటుచేసుకున్నామన్నారు. అందువల్లనే ఇటీవల కాలంలో వరుసగా కేసులు నమోదుచేస్తున్నామన్నారు.

అడుగడుగునా అక్రమాలు

... 3వ పేజీ తరువాయి

జారీచేయాల్సి ఉన్నా సరే ఆ విషయాన్ని టౌన్‌ప్లానింగ్ అధికారులు విస్మరించినట్టు నిర్ధారించారు. పైగా ఆ భవన నిర్మాణానికి ప్లాన్ కోసం రూ.9.67 కోట్లు ఫీజు కింద జీవీఎంసీకి చెల్లించాల్సి ఉండగా, జోన్-2 పరిధిలోని మూడు టీడీఆర్‌లను పెట్టి ఆదాయానికి గండికొట్టారు. ఇదిలావుండగా టౌన్‌ప్లానింగ్ అధికారులు ఈ నివేదికను రెండు రోజుల కిందట మేయర్‌కు అందజేశారు. ఈ ప్రాజెక్టుపై 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్‌తోపాటు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు జీవీఎంసీ అధికారులతోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రులు లోకేష్, పి.నారాయణకు ఫిర్యాదు చేయడంతో బిల్డర్ ముందుజాగ్రత్తగా భవనంపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడానికి వీల్లేకుండా కోర్టును ఆశ్రయించారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు కోర్టులో కౌంటర్ దాఖలు చేయకపోవడంతో బిల్డర్‌కు అనుకూలంగా కోర్టు ఆదేశాలు జారీచేసిందని అభిప్రాయపడుతున్నారు.

లైమ్ స్టోన్ సరఫరాలో అడ్డంకులు

... 3వ పేజీ తరువాయి

సహాయ పడుతుంది. అవసరమైన లైమ్ స్టోన్ ఆర్‌ఎంహెచ్‌పీ నుంచి సరఫరా కాకపోవడంతో బ్లాస్ట్ ఫర్నేస్‌లో లిక్విడ్ స్టీల్ ఉత్పత్తి ప్రక్రియ మందగించింది. దీంతో స్టీల్ ఉత్పత్తి మరింత క్షీణించింది. కాంట్రాక్టు కార్మికుల తొలగింపులో యాజమాన్యం అనాలోచిత నిర్ణయాలతో ఈ సమస్య ఉత్పన్నమైందని ఉద్యోగ వర్గాలు ఆరోపిస్తున్నాయి.

29న ఆహార భద్రతపై ఉచిత శిక్షణ

వెంకోజీపాలెం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూయర్ ఆఫ్ ఇండియా (ఎలీప్), పరిరక్షణ్ సంస్థతో కలిసి ఈ నెల 29న ఆహార భద్రత-అలవాట్లపై ఒక్క రోజు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ఎలీప్ సంస్థ అధ్యక్షురాలు కె.రమాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎంటీసీ కాలనీ డాక్టర్ కాలనీలోని ఎలీప్ సంస్థ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. ఆహార వ్యాపారాల కోసం నైపుణ్యం, ఆత్మవిశ్వాసం పెంపు, ఎస్‌హెచ్‌జీ మహిళల సాధికారత, ఆహార భద్రత వంటి అంశాలపై శిక్షణ ఇవ్వడంతో పాటు పాల్గొన్న వారికి సర్టిఫికెట్లను కూడా అందజేయనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెం.63014 41183లో సంప్రదించాలని కోరారు.

కాలభైరవ స్వామికి అమావాస్య పూజలు


పూజలందుకుంటున్న కాలభైరవస్వామి

వెంకోజీపాలెం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెంలోని శ్రీ గౌరీ జ్ఞాన లింగేశ్వరాలయంలో వేంచేసియున్న కాలభైరవ స్వామికిశనివారం అమావాస్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి భక్తులు పాల్గొని కాలభైరవ స్వామిని కొలిచారు. కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం మాజీ అధ్యక్షుడు డాక్టర్ బోర వెంకటరమణారెడ్డి, బోర యర్రాజీరెడ్డి, ఇతర గ్రామస్థులు, అధికసంఖ్యలో భక్తులుపాల్గొన్నారు.

ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు

» ఆహార శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు తరలింపు


ఫుడ్ శాంపిల్స్ సేకరిస్తున్న అధికారులు

సిరిపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ అవుట్‌గేట్ దగ్గర ఉన్న స్పైసీ బిర్యాని హౌస్‌లోని శనివారం రాత్రి ఫుడ్‌సేఫ్టీ అధికారులు దాడులు నిర్వహించారు. బిర్యాని హౌస్‌లోని ఫ్లోరింగ్, టైల్స్, వాల్స్, డ్రైనేజీ సిస్టమ్ చూసి అవాక్కయ్యారు. దీంతో పాటు మెడికల్ సర్టిఫికెట్, వాటర్ సప్లయ్ అనుమతులు లేకపోవడం గుర్తించారు. ఈ సందర్భంగా ఫుడ్ స్టేఫీ అధికారి జీవీ అప్పారావు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైడ్ నిర్వహించినట్టు చెప్పారు. స్పైసీ బిర్యానీ హౌస్‌కు సంబంధించి చాలా వరకు అనుమతులు లేవన్నారు. వారం రోజుల్లో తాము చెప్పిన అనుమతులు అన్నీ తీసుకోవాలని, లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. అలాగే ఇక్కడ వండిన చికెన్ బిర్యాని, పౌడర్‌లపై కూడా శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపుతున్నట్టు వెల్లడించారు. రెస్టారెంట్ నిర్వాహకులు కచ్చితంగా ఫుడ్‌సేఫ్టీ నియమ నిబంధనలు, ఆహార నాణ్యత పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఫుడ్‌స్టేఫీ సిబ్బంది పాల్గొన్నారు.

డిపోలు, గ్యారేజీల్లో శుభ్రత పాటించాలి

» ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు


స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్టీసీ రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు

ద్వారకాబస్‌స్టేషన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : విశాఖ రీజియన్ పరిధిలోని అన్ని ఆర్టీసీ డిపోలు, కాంప్లెక్సులు, గ్యారేజీలు పరిశుభ్రంగా ఉంచాలని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు కోరారు. విశాఖపట్నం డిపోలో శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిపో అవరణలో ఏర్పాటు చేసిన అధికారులు, సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడుతూ పని చేసే ప్రదేశాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల మంచి వాతావరణం నెలకొంటుందని, తద్వారా పనిచేసే సామర్థ్యం పెరుగుతుందన్నారు. అనంతరం డిపో, గ్యారేజీలల్లో పరిశుభ్రతా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ గంగాధరరావు, అసిస్టెంట్ ఇంజినీర్లు సుదర్శన్, ప్రశాంతి, డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ ఎంఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కళాభారతి 24వ జాతీయ ఉత్సవాలు ప్రారంభం


ద్వారం దుర్గాప్రసాద్‌రావుకు స్వర్ణకమలం బహూకరిస్తున్న వైభవ్ జ్యువెలర్స్ అధినేత్రి గ్రంధి మల్లికామనోజ్

మద్దిలపాలెం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురంకాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో శనివారం కళాభారతి 24వ జాతీయ పురస్కారాల ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు కళాభారతి నిర్వాహకులు హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి సోమయాజులు సమక్షంలో ప్రముఖ వయోలిన్ విద్వాంసులు ద్వారం దుర్గాప్రసాద్‌రావుకు 'నాద విద్యాభారతి' బిరుదు ప్రదానం చేశారు. అలాగే రూ.లక్ష నగదు, నూతన వస్త్రాలతో దుర్గాప్రసాద్‌రావు దంపతులకు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు వైభవ్ జ్యువెలర్స్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ గ్రంధి మల్లికామనోజ్ స్వర్ణకమలం బహూకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కళాకారులను ప్రోత్సహించడం తమ బాధ్యతగా భావిస్తున్నామన్నారు. భవిష్యత్‌లో కూడా కళలు, కళాకారులను ప్రోత్సహించడంలో వైభవ్ సహకారం ఉంటుందన్నారు. రిటైర్డ్ జడ్జి సోమయాజులు మాట్లాడుతూ 24 ఏళ్లుగా కళలను ప్రోత్సహించడంలో కళాభారతి నిర్వాహకులు చూపుతున్న చొరవ ఎంతోమందికి ఆదర్శనీయమన్నారు.

అనంతరం నిర్వహించిన ద్వారం సత్యనారాయణ కచేరి అలరించింది. కార్యక్రమంలో కళాభారతి అధ్యక్షుడు మంతెన సత్యనారాయణరాజు, కార్యదర్శి గుమ్మలూరి రాంబాబు, పైడా కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీనియారిటీ ప్రకారం పదోన్నతులు

» సీనియర్ అసిస్టెంట్ ప్రమోషన్లపై హైకోర్టులో జీవీఎంసీ సీనియర్ ఉద్యోగుల పిటిషన్


మాట్లాడుతున్న న్యాయవాది ఉమామహేశ్వరరావు

వెంకోజీపాలెం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీలో త్వరలో ఇవ్వనున్న సీనియర్ అసిస్టెంట్ పదోన్నతుల్లో సీనియారిటీని పరిగణనలోకి తీసుకోవాలని, ఈ విషయంలో జరుగుతున్న అవకతవకలపై జీవీఎంసీ సీనియర్ ఉద్యోగుల తరపున హైకోర్టులో పిటిషన్‌ను దాఖలు చేసినట్టు హైకోర్టు న్యాయవాది బి.ఉమామహేశ్వరరావు తెలిపారు. శనివారం కేఆర్ఎం కాలనీలోని ఆయన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ 2007లో టాక్స్ కలెక్టర్లుగా ఉద్యోగంలో చేరిన జీవీఎంసీ ఉద్యోగులు 2014లో పదోన్నతులు పొందుతూ జూనియర్ అసిస్టెంట్లు అయ్యారన్నారు. అయితే వీరిలో కొంతమంది పదోన్నతి కోసం (సీనియర్ అసిస్టెంట్) పరీక్షలు రాస్తూ 2020 నుంచి 2023 వరకు ఉత్తీర్ణతలు పొందారన్నారు. కానీ వీరికి ప్రమోషన్లు మాత్రం ఇవ్వలేదన్నారు. ఈ మధ్యలో 2014 తరువాత నేరుగా జూనియర్ అసిస్టెంట్ పదవిలో ఉద్యోగంలో చేరిన వారు కూడా పదోన్నతి కోసం పరీక్షలు రాశారని, వీరిలో కూడా కొంతమంది పరీక్ష ఉత్తీర్ణత సాధించారన్నారు. జీవీఎంసీ 2023లో పదోన్నతులను ఇచ్చేందుకు అప్పటి స్టాండింగ్ కమిటీ ఆమోదం కూడా పొందిందని, కానీ ముందు నుంచి ఉన్న వారి లిస్టులను వెనక్కి పెట్టి, తమ తరువాత ఉద్యోగంలో చేరిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నారని సీనియర్ ఉద్యోగులు ఆరోపించడం, ఈ క్రమంలో తమ ద్వారా హైకోర్టులో 2023లో డబ్ల్యు.పి.నెంబరు. 28699/2023 పిటిషన్ వేయడంతో పదోన్నతులు నిలిచిపోయాయన్నారు.

ఇప్పుడు మళ్లీ జీవీఎంసీ పదోన్నతులు కల్పించేందుకు సిద్ధమౌతోందని తెలిసి పాత పిటిషన్‌పై విచారణ నడుస్తూనే కొత్తగా ఈ ఏడాది డబ్ల్యు.పి.నెంబరు.22487/2025తో మళ్లీ పిటిషన్‌ను వేశామన్నారు. సీనియర్ ఉద్యోగుల తరపున జీవీఎంసీ ఉన్నతాధికారులు సీనియరిటీకి ప్రాధాన్యం కల్పించాలని కోరుతున్నామన్నారు. పదోన్నతుల విషయంలో పాత వారికి అవకాశం కల్పించాలని, వెంటనే వారికి తొలి ప్రాతిపదికన పదోన్నతులు కల్పించాలని, లేకుంటే వారు పదోన్నతులు పొందకుండానే పదవీ విరమణ పొందే ఇబ్బందికర పరిస్థితి ఎదురవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పదోన్నతుల విషయంలో అటు ఉన్నతాధికారులు, ఇటు పాలకవర్గం, రాష్ట్ర ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలని న్యాయవాది ఉమామహేశ్వరరావు కోరారు.

పారిశుధ్య కార్మికులకు టీ షర్ట్‌లు పంపిణీ


కార్మికులకు టీషర్ట్‌లను అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీవిద్య

వెంకోజీపాలెం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో కష్టపడి పనిచేసిన పారిశుధ్య సిబ్బందికి శనివారం 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య టీషర్టులను అందజేశారు. యోగాంధ్రలో పాల్గొన్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసిన తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు, చిత్తశుద్ధితో పనిచేసిన పారిశుధ్య కార్మికులకు కార్పొరేటర్ శ్రీవిద్య ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషోర్, శుభ్రం మేస్త్రి జి.రమణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

300 మట్టి విగ్రహాలు రూపొందించిన విద్యార్థులు


మట్టి విగ్రహాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి పర్యావరణానికి హాని కలిగించని మూడు వందల మట్టి విగ్రహాలను సత్యసాయి విద్యా విహార్ విద్యార్థులు తయారుచేశారు. పాఠశాలలోని ఆరు, ఏడు తరగతుల విద్యార్థులు ఈ మట్టి విగ్రహాలను తయారుచేసి పరిసర ప్రాంతీయులకు పంపిణీ చేశారు. విద్యార్థుల చేతుల్లో తయారైన విగ్రహాలను అందరినీ ఆకర్షిస్తున్నాయి.

23వ వార్డులో 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ'


మహిళలకు కరపత్రాలు అందిస్తున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు కెకె రాజు, వైసీపీ ఇతర నేతలు

మద్దిలపాలెం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 23వ వార్డు ప్రియదర్శిని కాలనీలో శనివారం తూర్పు నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు కెకె రాజు పాల్గొని ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హామీలన్నీ పక్కన పెట్టారన్నారు. అందరికీ నాది ష్యూరిటీ అని చెప్పిన చంద్రబాబు మోసం చేశారన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు బోర కుమార్‌రెడ్డి, పులగం సూర్యానారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ నర్సింగ్ విద్యార్థినులకు నైపుణ్య శిక్షణ

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : బీఎస్సీ (నర్సింగ్/ జీఎన్ఎం) కోర్సు పూర్తి చేసిన ఎస్సీ, ఎస్టీ మహిళా అభ్యర్థులకు జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సాంఘిక సంక్షేమ శాఖ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనుందని ఆ శాఖ ఉప సంచాలకులు కె.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆస్పత్రులు, కేర్ హోమ్స్‌లో పని చేయడానికి రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా పరదేశిపాలెం సాంఘిక సంక్షేమ కళాశాల వసతిగృహంలో ఉచిత జర్మన్ లాంగ్వేజ్ శిక్షణ, ఉపాధి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. జర్మనీలో ఉపాధి పొందేవారికి రూ.2.50 లక్షల వేతనం లభించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల మహిళలు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాల కోసం ఫోన్ : 0891 2551001లో సంప్రదించాలని కోరారు.

గొడ్డు మాంసం తరలిస్తున్న వ్యాన్ సీజ్

ఆరిలోవ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఒక మినీ వ్యానులో గొడ్డు మాంసం తరలిస్తుండగా ఆరిలోవ పోలీసులు శనివారం సాయంత్రం హనుమంతవాక జంక్షన్‌లో పట్టుకున్నారు. సుమారు 8,640 కిలోల గొడ్డు మంసం ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. వ్యాన్ డ్రైవర్ చిప్పాడ వెంకటరమణ, క్లీనర్ శ్రీహరిని అదుపులోకి తీసుకున్నట్టు ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు ఈ మాంసాన్ని విజయనగర్ నుంచి రాజమండ్రికి తరలిస్తున్నట్టు వ్యాన్ డ్రైవర్ తెలిపినట్టు పోలీసులు చెప్పారు. వీరిపై కేసు నమోదు చేసి వ్యానును సీజ్ చేసినట్టు సీఐ తెలిపారు. కేసును ఎస్ఐ పల్లా శంకర్ యాదవ్ దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈ కేసుతో సంబంధం ఉన్న వెల్లంకి చెందిన జగ్గారావు, ఎండగి ఇషాక్ పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

జాబ్‌మేళాలో 90 మంది ఎంపిక

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ డేటాప్రో ఆవరణలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాలో తొలిదశలో 90 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్, బీటా మాంక్స్, ఆల్ హ్యాండ్స్, గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్, కాన్సెంటిక్స్, టాటా ఎలక్ట్రానిక్స్ తాయో ల్యాబ్స్, సుదర్శిని సొల్యూషన్స్ ఎల్ఎల్‌పి తదితర సంస్థలు అభ్యర్థులను ఎంపిక చేసుకున్నాయి. పన్నెండు వందల మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, 800 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎనిమిది కంపెనీల్లో 450 ఖాళీల కోసం జాబ్ మేళా నిర్వహించారు. తొలి దశలో 90 మంది అభ్యర్థులను ఎంపిక చేసుకుని, తదుపరి రౌండ్‌కు అర్హత సాధించినట్లు ఆయా కంపెనీలు తెలిపాయి. ప్రాథమికంగా అభ్యర్థులకు ఏటా రూ. 1.80 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకూ వేతనాలు ఉంటాయని డేటాప్రో డైరెక్టర్లు రంగినేని సాయిప్రసాద్, సిద్ధవరపు ప్రసాద్ తెలిపారు. డేటాప్రో జాతీయ నైపుణ్యాభివృద్ధిసంస్థ భాగస్వామ్యంతో నైపుణ్య శిక్షణలు,ఉద్యోగావకాశాలను పెంపొందించే దిశగా కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ జనరల్ మేనేజర్ కిషోర్,సెంటర్‌మేనేజర్‌రవి పర్యవేక్షించారు.

చిరు జన్మదినం సందర్భంగా అమెరికాలో ప్రవాసుల రక్తదానం



విశాఖపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : మెగాస్టార్ చిరంజీవి స్ఫూర్తితో ఆయన 70వ జన్మదినాన్ని పురస్కరించుకొని అమెరికాలో ఉన్న ప్రవాసులు సుమారు 700 మంది శనివారం రక్తదానం చేశారు. అమెరికా దేశవ్యాప్తంగా అనేక నగరాల్లో రెడ్‌క్రాస్ సహకారంతో ఈ రక్తదానాన్ని చేశారు. అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ అధ్యక్షుడు మధు ఉల్లి, సభ్యులు సప్తగిరీష్ ఇందుల, సంతోష్ యాతం, సునీల్ నల్లలల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. మిన్నెసోటా, టెక్సాస్, న్యూజెర్సీ, వాషింగ్టన్, ఒహాయో, కాలిఫోర్నియా రాష్ట్రాల్లోని అనేక నగరాల్లో ఈ రక్తదాన శిబిరాలు నిర్వహించారు.

కృష్ణా కళాశాలలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర


చెత్తను ఏరుతున్న కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, సిబ్బంది

మద్దిలపాలెం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) :మద్దిలపాలెంలోని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రిన్సిపాల్ బి.సుజాత, అధ్యాపకులు, విద్యార్థులు కళాశాల పరిసరాల్లో చెత్తను ఏరి శుభ్రం చేశారు. ముందుగా విద్యార్థులతో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుజాత మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామన్నారు. చెత్త పేరుకుపోవడం వలనే అనారోగ్యం బారిన పడతామన్నారు.

అలాగే మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత ప్రతీ ఒక్కరూ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి బి.సన్యాసిరావు, అధ్యాపకులు వేదవ్యాస్, బాలమురళీ, పీవీ రమణ, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'విశ్వసాహితీ' రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్



విశాఖపట్నం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ప్రముఖ కవి, రచయిత, సాహితీవేత్త, లఘుచిత్రాల రూపకర్త సత్తివాడ శ్రీకాంత్ విశ్వసాహితీ కళా వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ చైర్‌పర్సన్ కొల్లి రమావతి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. సంస్థ అభివృద్ధికి విశేష కృషి చేయాలని పేర్కొన్నారు. తనను 'విశ్వసాహితీ' రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించడం పట్ల శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు.

సినిమా గైడ్

- **పరదా** : శారద, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **మేఘాలు చెప్పిన ప్రేమకథ** : రమాదేవి, మోహిని (గాజువాక)
- **బన్ బట్టర్ జామ్** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య హెవెన్ (గాజువాక)
- **యూనివర్సిటీ** : శ్రీకాంతి
- **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
- **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 24, టమాటా 50, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 40, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 30, బీరకాయలు 48, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 46, దొండకాయలు 32, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది) 74, బరబాటి 36, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 110, కీరదోస 32, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 46, కంద 40, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

నగర ప్రథమ మేయర్ ఎన్ఎస్ఎన్ రెడ్డికి ఘన నివాళి


ఎన్ఎస్ఎన్‌రెడ్డికి నివాళులు అర్పిస్తున్న ఆయన కుమారుడు ఎన్.విజయానందరెడ్డి, ట్రస్టు ప్రతినిధులు

సిరిపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : నగరాభివృద్ధిలోని విశాఖ ప్రథమ మేయర్ నీలాపు సూర్యనారాయణ (ఎన్ఎస్ఎన్ రెడ్డి) సేవలు ఎప్పటికీ మరిచిపోలేనివని పలువురు వక్తలు కొనియాడారు. శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం పార్కులో ఉన్న ఎన్ఎస్ఎన్ రెడ్డి విగ్రహం వద్ద ఎన్ఎస్ఎన్ రెడ్డి స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎన్ రెడ్డి 34వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ట్రస్టు సభ్యుడు, ఆయన కుమారుడు ఎన్.విజయానందరెడ్డి ముందుగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎన్ రెడ్డి దూరదృష్టి, అంకితభావం, స్వార్థరహిత సేవలను అందించారన్నారు. కార్యక్రమంలో ఎన్.వివేకానందరెడ్డి, ఎన్.స్వర్ణలత, ఎన్.సుధీర్, ఎన్.చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

దత్తత గ్రామాల అభివృద్ధిపై సమగ్ర చర్చ


దత్తత గ్రామాల అభివృద్ధిపై గ్రామాల ప్రతినిధులతో చర్చిస్తున్న అంబేద్కర్ చైర్ ప్రతినిధి ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్

విశాఖపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఏయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చైర్ శనివారం దత్తత గ్రామాల ప్రతినిధులతో సమావేశమైంది. అంబేడ్కర్ చైర్ పినగాడి, గొంపల్లి, రాంపురం, కరకవానిపాలెం, కోటవానిపాలెం గ్రామాలను దత్తత తీసుకుంది. అక్కడ వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోంది. ఈ నేపథ్యంలోనే ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు స్వచ్ఛంద కార్యకర్తలతో అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ ఎం. జేమ్స్ స్టీఫెన్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మూడు అంశాలను చర్చించారు. దత్తత తీసుకున్న గ్రామాల ప్రతినిధులను సమైక్యపరిచి అంబేడ్కర్ హెల్పింగ్ హ్యాండ్స్ ఏర్పాటు చేయాలని సమావేశం నిర్ణయించింది. ఈ సందర్భంగా గ్రామాల ప్రతినిధులు మంచినీటి సమస్యను వివరించారు. సమావేశంలో గ్రామాల ప్రతినిధులు బి.భగవాన్‌జయరాం, గొరపల్లి శ్రీను, రెడ్డి నారాయణరావు, కె.రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణనాథుడినే పూజిద్దాం


మట్టి వినాయక ప్రతిమలతో విద్యార్థులు

పెదవాల్తేరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : గణేష్ చతుర్థి వేడుకలను మట్టి వినాయక ప్రతిమలతో నిర్వహిద్దామని గాయత్రి విద్యాపరిషత్ పాఠశాల ప్రిన్సిపాల్ కె.మధురవాణి పేర్కొన్నారు. శనివారం ఈస్ట్‌పాయింట్ కాలనీలో గల గాయత్రీ విద్యా పరిషత్ ఎంఎల్‌టీటీ పాఠశాలలో పర్యావరణ హితాన్ని కాంక్షిస్తూ మట్టి వినాయక బొమ్మల తయారీ కార్యక్రమాన్ని ఆంధ్ర విశ్వ కళాపరిషత్ లలిత కళల విభాగం, గాయత్రీ విద్యా పరిషత్ సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను మాత్రమే వాడాలని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వాడకం వల్ల జల, వాయు కాలుష్యాలు పెరుగుతాయన్నారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశంగా చెప్పారు. ప్రత్యేక మట్టితో శిక్షణ పొందిన విద్యార్థులతో ఈ బొమ్మలు తయారు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో గాయత్రీ విద్యాపరిషత్ ఉపాధ్యక్షుడు దక్షిణామూర్తి, కార్యదర్శి పి.సోమరాజు, సంయుక్త కార్యదర్శి డీవీఎస్ కామేశ్వరరావు పర్యవేక్షించారు.

13వ వార్డులో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రపై అవగాహన ర్యాలీ

ఆరిలోవ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) జీవీఎంసీ 13వ వార్డులో గల వెర్ని దుర్గానగర్‌లో గల రామాలయం వద్ద శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర నిర్వహించారు. కార్పొరేటర్ సునీతాసత్యనారాయణ, టీడీపీ వార్డు అధ్యక్షుడు పాత్రకుండ దర్మారావు, స్థానిక నాయకులు ప్లాస్టిక్‌కు దూరంగా ఉంచాలని, పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.

ఉత్సాహంగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర



జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ఉద్యోగులు



సీతమ్మధార రైతుబజార్ ఆవరణలో రైతులతో కలిసి జీవీఎంసీ అధికారుల ర్యాలీ



అమర్‌నగర్‌లో రోడ్డును శుభ్రపరుస్తున్న కార్పొరేటర్ వీరారావు బుజ్జి తదితరులు

మహారాణిపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్, కేజీహెచ్, జిల్లా పరిషత్ కార్యాలయాల్లో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. వర్షాకాలంలో పరిశుభ్రత అనే అంశంపై కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వో భవానీశంకర్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది పరిశుభ్రతా చర్యలు చేపట్టారు. పిచ్చి మొక్కలు తొలగించి, నీటి నిల్వ ప్రాంతాలను శుభ్రపరిచారు. స్వచ్ఛాంధ్రప్రదేశ్ సాధనకు తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కేజీహెచ్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి సారథ్యంలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రి వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. వర్షాకాలంలో వేడి ఆహారం తీసుకోవాలని, దోమలు వ్యాప్తిని నిరోధించేలా నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని సూపరింటెండెంట్ సూచించారు. స్వచ్ఛాంధ్రపై పోటీలు నిర్వహించారు. జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో సీఈవో నారాయణమూర్తి ఆధ్వర్యంలో అధికారులు, ఉద్యోగులు స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో పరిసరాలను శుభ్రపరిచారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు.

దొండపర్తి: గ్రేటర్ 27వ వార్డు అమర్‌నగర్‌లో ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ నాగరాజు పర్యవేక్షణలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి హాజరై రోడ్డును శుభ్రపరిచారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని సూచించారు. గుడ్డ, నార సంచులు వాడాలని కోరారు. అనంతరం స్థానిక పారిశుధ్య కార్మికుడు రాజును సత్కరించారు.సచివాలయ అడ్మిన్లు, శానిటరీ కార్యదర్శులు లక్ష్మణ్, వాసు పాల్గొన్నారు.

సీతమ్మధార: ప్రతి ఒక్కరూ స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగస్వాములు కావాలని, గుడ్డ, నార సంచులను మాత్రమే వాడాలని జీవీఎంసీ ఎస్ఎస్ సత్యనారాయణ సూచించారు. సీతమ్మధార రైతు బజార్ ప్రాంతంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీతమ్మధారలో ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. వర్షకాలంలో నీరు నిల్వ లేకుండా చూడాలని, దోమలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పలుచోట్ల శుభ్రం చేసి బ్లీచింగ్ జల్లారు. రైతుబజార్ ఈఓ కృష్ణమూర్తి, సతీష్, రైతులు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



అర్హులకు మంజూరుపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధారలోని బీజేపీ కార్యాలయంలో 14వ వార్డుకు చెందిన పలువురు అనారోగ్య పీడితులకు ముఖ్యమంత్రి సహాయ నిధిని శనివారం అందజేశారు. బాధితులు ఆకుల పద్మ గంగాభవానికి రూ.2,65,997, నడుపూరి హనుమంతరావుకు రూ.1,03,923, కలిసెటి సుశాంతికి రూ.45,011, సుదమల్ల లోవకి రూ.31,218, గండిమని వెంకట మోహిత్‌కి రూ.21,229 మొత్తాలకు చెక్కులను ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు అందచేశారు. నాయకులు శ్యామల దీపిక, పృథ్వీరాజ్, డాక్టర్ ఎస్‌కెఈ అప్పారావు, సురేష్, కూటమి నాయకులు ధర్మారావు, కృష్ణారావు, రామరాజు పాల్గొన్నారు.

పూల అలంకరణ పోటీలు

డాబాగార్డెన్స్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 31న రాధాష్టమి సందర్భంగా హరేకృష్ణ మూమెంట్ (విశాఖపట్నం) ఆధ్వర్యంలో రెండు విభాగాల్లో పూల అలంకరణ పోటీలు నిర్వహిస్తున్నట్టు సంస్థ వైస్ ప్రెసిడెంట్ యదురాజ దాస తెలిపారు. శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 12 నుంచి 16 ఏళ్లలోపు బాలబాలికల కోసం 30న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, 31న ఉదయం 10 నుంచి 12 గంటల మధ్య 16 సంవత్సరాలు దాటిన మహిళలకు పోటీలను హరేకృష్ణ వైకుంఠం ఐఐఎంరోడ్డు గంభీరం, ఆనందపురంలో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనదలచినవారు పూల దండలు, పుష్ప గుచ్ఛాలు మాత్రమే తయారు చేయవలసి ఉంటుందన్నారు. పోటీదారులు పూలను, సామగ్రిని వారే తెచ్చుకోవాలన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.40 వేలు, మూడో బహుమతి రూ.25 వేలను అందజేస్తామన్నారు. ఇతర వివరాలకు 77990 06648 ఫోన్ నెంబరులో సంప్రదించాలని కోరారు.

ఒంగోలు మహాసభలకు తరలిన సీపీఐ జిల్లా నాయకులు

అల్లిపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా ఒంగోలులో జరుగుతున్న సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలకు విశాఖ జిల్లా నుంచి పలువురు సీపీఐ జిల్లా ప్రతినిధులు తరలివెళ్లారు. ఈ సభల్లో ఉక్కు పరిరక్షణ, జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం పార్టీ చేపట్టాల్సిన పోరాటాలపై చర్చించి రానున్న రోజుల్లో ఉద్యమాన్ని ఉధృతం చేయనున్నామని జిల్లా నాయకులు ఎం.పైడిరాజు, ఎస్.కె రెహమాన్ తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శులు కె.సత్యనారాయణ, పి.చంద్రశేఖర్, కె.సత్యాంజనేయ, ఆర్.శ్రీనివాసరావు వెళ్లారు.

26న రైతుబజారు తెరిచే ఉంటుంది

కంచరపాలెం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న వినాయక చవితి పర్వదినం నేపథ్యంలో కంచరపాలెం రైతుబజార్ ముందు రోజు (మంగళవారం) తెరిచే ఉంటుందని ఎస్టేట్ అధికారి జగదీష్ పేర్కొన్నారు. ప్రతి మంగళవారం రైతు బజార్‌కు సెలవుదినం అయినప్పటికీ వినాయక చవితి పండగ ఉన్నందున జాయింట్ కలెక్టరు ఆదేశాల మేరకు బజారును తెరుస్తామన్నారు. ప్రజలు గమనించాలని తెలిపారు.

ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

అక్కయ్యపాలెం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో పీడీ రత్నం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి వీటిని ప్రారంభించారు. టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈ నెల 29న బహుమతి ప్రదానం చేస్తామన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

విశాలాక్షినగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తెన్నేటి పార్కు వెనుక ఉన్న తీరంలో శనివారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభించింది. ఆరిలోవ ఎస్ఐ వై. కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పార్కు సమీపంలోని తీరంలో సుమారు 45 నుంచి 50 ఏళ్ల వయస్సు ఉన్న మహిళ మృతదేహం ఉన్నట్లు స్థానికులు సమాచారం ఇచ్చారన్నారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించామని చెప్పారు.

లాడ్జిలో యువకుడి ఆత్మహత్య

సాగర్‌నగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఫైనాన్స్ కంపెనీలో సేల్స్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న సంపత్ వినాయకరెడ్డి (27) రుషికొండలోని ఓ లాడ్జిలో బెడ్ షీట్‌తో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి గొర్లె శంకర్‌రామ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పీఎం పాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దొండపర్తి ప్రాంతానికి చెందిన సంపత్‌వినాయకరెడ్డి శనివారం ఉదయం ఉద్యోగానికి వెళ్లి సాయంత్రం ఇంటికి రాకపోవడంతో తండ్రి పలుసార్లు అతని సెల్‌కు ఫోన్ చేశాడు. ఎంత ప్రయత్నించినా అటు నుంచి స్పందన లేకపోవడంతో సంపత్‌వినాయకరెడ్డి సహ ఉద్యోగికి ఫోన్ చేయగా ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం చంద్రబాబు మహిళా పక్షపాతి: సీతంరాజు సుధాకర్



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు సీతంరాజు సుధాకర్

మహారాణిపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళా పక్షపాతి అని, వారి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని స్త్రీ శక్తి పేరుతో ఉచిత బస్సు రవాణా సౌకర్యం కల్పించి అత్యుత్తమ ప్రజా నాయకుడిగా పాలనాదక్షుడిగా పేరొందారని తెలుగుదేశం పార్టీ దక్షిణ నియోజకవర్గం అధ్యక్షుడు సీతంరాజు సుధాకర్ అన్నారు. శనివారం దక్షిణ నియోజకవర్గంలోని పండా వీధిలో మహిళలకు ఉచిత బస్సు సదుపాయంపై అవగాహన సమావేశం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి నగరానికి వస్తున్న మహిళలకు ఉచిత ప్రయాణం ద్వారా సుమారు రూ.3 వేలు ఆదా అవుతుందని తెలిపారు. నగరాన్ని అన్ని రంగాలలో అగ్రగామిగా నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారని సుధాకర్ అన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు విల్లూరి భాస్కరరావు, ఉరుకూటి నారాయణరావు, గొలగాని వీరారావు, కోడూరు వెంకటరత్నం, గొడె నరసింహాచారి, బుచ్చా రామిరెడ్డి, సీఎం రమణ, అబ్దుల్ చిన్న రహమాన్, కేదారి లక్ష్మి, ఎర్నాకుల జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ యత్నాలు ఆపకపోతే పెద్దఎత్తున ఉద్యమం

» రౌండ్ టేబుల్ సమావేశంలో కార్మిక, ప్రజా సంఘాల హెచ్చరిక



రౌండ్ టేబుల్ సమావేశంలో నినదిస్తున్న ప్రజా సంఘాల ప్రతినిధులు

మహారాణిపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఎక్స్‌ప్రెషన్స్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఈవోఐ) పేరుతో కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు పూనుకుంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని జిల్లా కార్మిక, ప్రజా సంఘాల జేఏసీ హెచ్చరించింది. శనివారం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి సీఎఫ్‌టీయూఐ జాతీయ అధ్యక్షుడు ఎన్.కనకారావు అధ్యక్షత వహించారు. తొలుత సీపీఐ నాయకుడు సురవరం సుధాకర్ రెడ్డి మృతికి సమావేశంలో సంతాపం వ్యక్తం చేశారు. జేఏసీ చైర్మన్ ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ కేంద్రం విశాఖ ఉక్కు పరిశ్రమలోని 46 కీలక విభాగాల ప్రైవేటీకరణకు సెప్టెంబరు 9లోగా బిడ్లు వేయాలని ప్రకటన జారీ చేసిందని, ఈవోఐ అనేది ప్రైవేట్‌కు ప్రతిరూపమని పేర్కొన్నారు. ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే సంస్థలకు కట్టబెడతారని తెలిపారు. విశాఖ ఉక్కును నట్టేట ముంచటానికి మోదీ ప్రభుత్వ కుట్రలను నివారించాలని, చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు వెంటనే రంగంలోకి దిగి విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. కేంద్రం పలు కీలక విభాగాల ప్రైవేటీకరణకు పూనుకుంటున్నా, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజులు ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ జరగదని చెప్పటం ప్రజలను మోసగించడమేనన్నారు. ఈ సమావేశంలో వివిధ సంస్థల నాయకులు ఆర్‌కేఎస్‌వీ కుమార్, పి.వి.సురేష్, ఆర్.అనిల్‌కుమార్, నాగభూషణం, దేవా, కె. శంకరరావు, డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణ



మాట్లాడుతున్న కె.వెంకటసుబ్బయ్య

కంచరపాలెం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో ఈ నెల 18 నుంచి ప్రారంభమైన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఆరు రోజులు జరిగిన డిజైన్ థింకింగ్ న్యూమరికల్ అప్రోచ్ శిక్షణలో భాగంగా ఆఖరి రోజు కార్యక్రమంలో జేఎన్‌టీయూ ప్రొ.కె.వెంకటసుబ్బయ్య ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ ఉద్దేశాన్ని వివరించారు. ఆరు రోజులు జరిగిన ఈ కార్యక్రమం ద్వారా అధ్యాపకులు, పరిశోధకులు ఎన్నో విషయాలు నేర్చుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విశిష్ట అతిథి శాస్త్రవేత్త డా.వి.రామకృష్ణ మాట్లాడుతూ నావికాదళంలో ఉపయోగించే ప్రొపెల్లర్ల రూపకల్పన, నియంత్రణలో సంఖ్యా విశ్లేషణ చాలా కీలకమని వివరించారు. శిక్షణ పొందిన అధ్యాపకులు, పరిశోధకులు ప్రాక్టికల్స్ అనువర్తనాలను తెలుసుకోవడం ద్వారా స్ఫూర్తిని పొందారన్నారు. వివిధ కళాశాలల నుంచి హాజరైన ప్రిన్సిపాల్స్ తమ అనుభవాలను పంచుకున్నారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.కె.రత్నకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శిక్షణ సమన్వయకర్త డా.సీహెచ్.రాజు, సహసమన్వయకర్త ఎం.భరణి, ప్రిన్సిపాల్స్ ఎం.హరిబాబు, విక్టరీ పాల్, అధ్యాపకులు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

టంగుటూరి సేవలు ప్రశంసనీయం



ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

సీతమ్మధార, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఎదిరించిన యోధుడుగా ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ప్రసిద్ధి పొందారని, దేశానికి ఆయన చేసిన సేవలు ప్రశంసనీయమని నాగార్జున యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి, గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య బాలమోహన్‌దాస్ కొనియాడారు. బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్ హాలులో శనివారం టంగుటూరి ప్రకాశం పంతులు 153వ జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రకాశం పంతులు చిత్రపటానికి అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ప్రకాశం పంతులు గొప్పతనాన్ని, త్యాగాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారి రామేశ్వరి, బాపు సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అంతర్వేది రమణి, హుస్సేన్, చాట్ల బాబూరావు రెడ్డి, గాంధీ సెంటర్ కార్యదర్శి డాక్టర్ రామారావు పాల్గొన్నారు.

'మోటారు చట్ట నిబంధనలు పాటించాల్సిందే'



ట్రాన్స్‌పోర్టు సంస్థల ప్రతినిధులతో సమావేశమైన జేసీఎల్ రామారావు, డిప్యూటీ కమిషనర్ సునీత

అక్కయ్యపాలెం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం మోటారు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యాక్ట్-1961 నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిందేనని కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ (జేసీఎల్) ఎం.రామారావు ట్రాన్స్‌పోర్టు యాజమాన్యాలను ఆదేశించారు. అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలోని కార్మిక శాఖ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇకపై డ్రైవర్ల పనిగంటలు, విశ్రాంతి వ్యవధి విషయాల్లో ఎలాంటి సడలింపులు ఉండవని స్పష్టం చేశారు. జిల్లా ట్రాన్స్‌పోర్టు కమిషనర్ జయప్రకాశ్ మాట్లాడుతూ ప్రతి 350 కిలోమీటర్ల డ్రైవింగ్ తర్వాత డ్రైవర్లకు తప్పనిసరిగా విశ్రాంతి ఇవ్వాలన్నారు. గతంలో కొంత సడలింపు ఇచ్చినా, సుప్రీంకోర్టు ఆదేశాల దృష్ట్యా ఇకపై కఠినంగా అమలు చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎంటీడబ్ల్యూ-ఐసీబీ-ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్ పోర్టల్ ద్వారా వాహనాలు, డ్రైవర్లు, క్లీనర్ల వివరాలు నమోదు చేయడం, జీపీఆర్ఎస్ ఆధారంగా పరిశీలన జరగడం తప్పనిసరి అయిందని పేర్కొన్నారు. సంస్థ ప్రతినిధులు కొన్ని సమస్యలను లేవనెత్తారు. భారత్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ అక్షరాస్యతలేని డ్రైవర్లకు బదులు మేనేజ్‌మెంట్ డేటా ఎంట్రీ చేసే అవకాశం ఇవ్వాలని కోరింది. నవతా ట్రాన్స్‌పోర్ట్ రాత్రి 9 నుంచి ఉదయం 5 గంటల వరకు షెడ్యూల్‌కి అనుగుణంగా పోర్టల్‌లో ఆమోదం ఉందా? అని వివరణ కోరింది. సంపత్ వినాయక ట్రావెల్స్ రామలింగేశ్వర ట్రావెల్స్-లేబర్ సెస్, ఇన్సూరెన్స్ చెల్లిస్తున్నప్పటికీ వర్క్‌మెన్స్ కాంపెన్సేషన్, బరువు పెరుగుతోందని అభ్యంతరం వ్యక్తం చేశాయి. వెబ్ అప్లికేషన్ తక్షణమే అమలు చేయాలని, సమస్యలుంటే కార్మిక శాఖకు తెలియజేయాలని సూచించారు. ఈ సమావేశంలో కార్మిక డిప్యూటీ కమిషనర్ ఎం.సునీత తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడికి ప్రత్యేక అలంకరణలు



వినాయకచవితి ఉత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఈఓ రమాబాయి, కార్పొరేటర్ గోవింద్ తదితరులు

సీతంపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సీతంపేట కూడలిలోని దుర్గాగణపతి ఆలయంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను ఈ నెల 27 నుంచి దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ రమాబాయి, ఉత్సవ కమిటీ చైర్మన్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ తెలిపారు. వినాయక చవితి రోజున స్వామివారు బంగారు, వెండి ఆభరణాలతో భక్తులకు దర్శనమిస్తారని, రోజూ గణపతి హోమాలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. 28న వాణిగణపతి, 29న లక్ష్మీగణపతి, 30న విఘ్నగణపతి, 31న ఆదిత్య గణపతి, సెప్టెంబరు 1న శివబాల గణపతి, 2న స్కంద గణపతి, 3న త్రిముఖ గణపతి, 4న అర్ధనారేశ్వర గణపతి రూపంలో రోజూ సాయంత్రం భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. సెప్టెంబరు 5న స్వామివారి ఉత్సవమూర్తులను సిద్ధి, బుద్ధి సమేతంగా పురవీధుల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగింపు మహోత్సవం జరుపుతామన్నారు.

ఐక్యత చాటిన ఏక్ భారత్- శ్రేష్ఠ భారత్ కళా ఉత్సవాలు



సంప్రదాయ నృత్యంలో పాల్గొన్న వివిధ రాష్ట్రాల విద్యార్థినులు

మర్రిపాలెం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్రీయ విద్యాలయ సంఘటన్, సీబీఎస్ఈ సమష్టిగా ఈ నెల 21 నుంచి మూడు రోజులు 104 ఏరియా కేంద్రీయ విద్యాలయంలో నిర్వహించిన ఏక్ భారత్-శ్రేష్ఠ భారత్ కళా ఉత్సవాలు శనివారం ముగిశాయి. హైదరాబాద్ రీజియన్‌లోని 72 పాఠశాలల నుంచి సుమారు 420మంది విద్యార్థులు పాల్గొన్నట్లు కేంద్రీయ విద్యాలయం-2 ప్రిన్సిపాల్ సీహెచ్.శ్రీనివాస్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ జాతీయ ఐక్యతా దినోత్సవం నిర్వహించడం వల్ల వివిధ సంప్రదాయ కళలను విద్యార్థులు నేర్చుకునే అవకాశం ఉంటుందన్నారు. వారిలో ఐక్యతాభావం పెంపొందుతుందన్నారు. బృంద నృత్యాలు, బృందగానం, చిత్రకళా ప్రదర్శన, వాయిద్య పరికరాల నైపుణ్యం, శిల్పకళా ప్రదర్శన తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. విజేతలు జాతీయస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

విశాఖ విమల విద్యాలయం మూసివేత

... 3వ పేజీ తరువాయి

విద్యార్థుల తల్లిదండ్రులు ముందుగానే మేల్కొన్నారు. పునఃప్రారంభం కోసం ఎదురుచూస్తే పిల్లల భవిష్యత్తు పోతుందని అత్యధికులు పిల్లలను ఇతర పాఠశాలల్లో చేర్పించారు. మొత్తం 1,700 మందిలో ఇప్పటికే 1,630 మంది బదిలీ సర్టిఫికెట్లు తీసుకుని వెళ్లిపోయారు. ఇంకా 70 మంది మాత్రమే మిగిలారు. వారికి ప్రైవేటు పాఠశాలల్లో చదివించే స్తోమత లేకపోవడంతో ఉండిపోయారు. పాఠశాల తెరుస్తారేమోనని ఆశించారు. ఈ ఏడాది ఇక సాధ్యం కాదని తాజాగా సొసైటీ నోటీసు పెట్టడంతో ఇప్పుడు వారు ఎక్కడో ఓ చోట చేరాల్సి ఉంది. వారికి టీసీలు ఇవ్వడానికి సొసైటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

లైమ్ స్టోన్ సరఫరాలో అడ్డంకులు

... 3వ పేజీ తరువాయి

సహాయ పడుతుంది. అవసరమైన లైమ్ స్టోన్ ఆర్ఎహెచ్‌పీ నుంచి సరఫరా కాకపోవడంతో బ్లాస్ట్ ఫర్నేస్‌లో లిక్విడ్ స్టీల్ ఉత్పత్తి ప్రక్రియ మందగించింది. దీంతో స్టీల్ ఉత్పత్తి మరింత క్షీణించింది. కాంట్రాక్టు కార్మికుల తొలగింపులో యాజమాన్యం అనాలోచిత నిర్ణయాలతో ఈ సమస్య ఉత్పన్నమైందని ఉద్యోగ వర్గాలు ఆరోపిస్తున్నాయి.

అడుగడుగునా అక్రమాలు

... 3వ పేజీ తరువాయి

జారీచేయాల్సి ఉన్నా సరే ఆ విషయాన్ని టౌన్‌ప్లానింగ్ అధికారులు విస్మరించినట్టు నిర్ధారించారు. పైగా ఆ భవన నిర్మాణానికి ప్లాన్ కోసం రూ.9.67 కోట్లు ఫీజు కింద జీవీఎంసీకి చెల్లించాల్సి ఉండగా, జోన్-2 పరిధిలోని మూడు టీడీఆర్‌లను పెట్టి ఆదాయానికి గండికొట్టారు. ఇదిలావుండగా టౌన్‌ప్లానింగ్ అధికారులు ఈ నివేదికను రెండు రోజుల కిందట మేయర్‌కు అందజేశారు. ఈ ప్రాజెక్టుపై 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్‌తోపాటు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు జీవీఎంసీ అధికారులతోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రులు లోకేష్, పి.నారాయణకు ఫిర్యాదు చేయడంతో బిల్డర్ ముందుజాగ్రత్తగా భవనంపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడానికి వీల్లేకుండా కోర్టును ఆశ్రయించారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు కోర్టులో కౌంటర్ దాఖలు చేయకపోవడంతో బిల్డర్‌కు అనుకూలంగా కోర్టు ఆదేశాలు జారీచేసిందని అభిప్రాయపడుతున్నారు.

స్టీల్ ప్లాంటులో మరో 468 మందికి వీఆర్ఎస్

... 3వ పేజీ తరువాయి

రావడం లేదు. రోజుకు 21 వేల టన్నుల ఉత్పత్తి లక్ష్యం కాగా శుక్రవారం (22వ తేదీన) మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు కలిపి 6,160 టన్నులు మాత్రమే హాట్ మెటల్ తీశారు. ఇది లక్ష్యంలో మూడో వంతు కూడా లేదు. ఇందులో ఉద్యోగుల తప్పిదం, అలసత్వం ఏమీ లేదు. కేవలం యాజమాన్యం తప్పుడు నిర్ణయాలు, సిబ్బందిని కుదించడం వల్లే ఇలా జరుగుతోంది. ఈ విషయాన్ని కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ గుర్తించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇన్‌చార్జి సీఎండీ సక్సేనా చెప్పిన మాటలనే విశ్వసిస్తోంది. ఇది ఉక్కు ఉద్యోగులు-రాష్ట్ర ప్రభుత్వం మధ్య అంతరం పెంచుతోంది. ఉక్కు యాజమాన్యం నిర్ణయాలపై కూటమి నాయకులు కూడా సమాధానం చెప్పుకోలేకపోతున్నారు. ప్రైవేటీకరణ జరగదని మాత్రం చెబుతున్నారు. వాటిని ప్లాంటులో ఒక్కరు కూడా విశ్వసించడం లేదు.

డిగ్రీ కాలేజీల్లో ముఖ ఆధారిత హాజరు

... 3వ పేజీ తరువాయి

చేయాలంటూ ఏయూ అధికారులు ఈ నెల 22న అనుబంధ డిగ్రీ కాలేజీల ప్రిన్సిపాల్స్, సెక్రటరీలు, కరస్పాండెంట్లకు సర్క్యులర్ విడుదల చేశారు. ఈ నెల 30లోగా మెషీన్లు ఇన్‌స్టాల్ చేయాలని స్పష్టంచేశారు. మెషీన్లు ఏర్పాటు చేసి వాటిని యూనివర్సిటీ నుంచి మానటరింగ్ చేసేందుకు అనుగుణమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సర్క్యులర్‌ను అత్యవసరంగా భావించాలని సీడీసీ డీన్ పేరుతో వెలువడిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

29న ముఖ్యమంత్రి రాక

... 3వ పేజీ తరువాయి

ప్రారంభిస్తారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి హాజరవుతారు. అనంతరం ప్రో కబడ్డీ పోటీలు ప్రారంభిస్తారు. అలాగే గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే అధికార భాషా దినోత్సవంలో పాల్గొంటారు. ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమాలు ఇంకా అధికారికంగా ఖరారు కావల్సి ఉంది. సీఎం పర్యటించే ప్రాంతాలను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, ఇతర అధికారులు శనివారం పరిశీలించారు. అనంతరం వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, జేసీ మయూర్‌అశోక్, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, ఏయూ అధికారులతో సమీక్షించారు.

నగరంలో నకిలీ మద్యం

... 3వ పేజీ తరువాయి

చేయగా 108 బాటిళ్లు లభ్యమయ్యాయి. ఈనెల 14న సీతంపేటలోని ఒక ఇంట్లో విదేశీ మద్యం విక్రయిస్తున్నట్టు సమాచారం అందడంతో సోదాలు చేయగా 99 నకిలీ విదేశీ మద్యం సీసాలు దొరికాయి. నెల రోజుల కిందట మధురవాడలోని ఎంవీవీ సిటీలో ఉంటున్న స్టీల్‌ప్లాంటు ఏజీఎం ఫ్లాట్‌లో సోదాలు నిర్వహించి వివిధ రాష్ట్రాలకు చెందిన మద్యంతోపాటు నకిలీ విదేశీ మద్యం 67 సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే గత నెల ఏడున మల్కాపురంలోని ప్రకాష్‌నగర్‌లోని ఒక ఇంటిపై దాడి చేసి 220 డిఫెన్స్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్ వివరణ కోరగా డిఫెన్స్ మద్యం విక్రయం, కొనుగోలు..రెండూ నేరమేనన్నారు. ఆ విషయం చాలామందికి తెలియక కొనుగోలు చేస్తున్నారన్నారు. మద్యం కావాలనుకునేవారు లైసెన్స్‌డ్ దుకాణాల వద్దనే కొనుగోలు చేయాలన్నారు. హానికరమైన రసాయనాలతో తయారుచేసిన నకిలీ మద్యం సేవిస్తే ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుందన్నారు. నగరంలో డిఫెన్స్, విదేశీ నకిలీ మద్యం పేరుతో జరుగుతున్న విక్రయాలపై ప్రత్యేక సమాచార వ్యవస్థను ఏర్పాటుచేసుకున్నామన్నారు. అందువల్లనే ఇటీవల వరుసగా కేసులు నమోదుచేస్తున్నామన్నారు.

ఉద్యోగం..ఉత్సాహం

... 3వ పేజీ తరువాయి

వస్తుండడంతో అభ్యర్థులు, వారి కుటుంబాల్లో ఆనందం వ్యక్తమవుతుంది. చంద్రబాబునాయుడు సీఎంగా ఉన్న సమయంలో 2018లో డీఎస్సీ నిర్వహించారని, ఆ తరువాత మళ్లీ ఇప్పుడు ఆయన హయాంలోనే పోస్టులు భర్తీ చేస్తున్నారని అభ్యర్థులు గుర్తుచేస్తున్నారు. ఒకేసారి పలు యాజమాన్యాల పరిధిలో ఖాళీలు భర్తీచేయడం చాలావరకు ఉపయోగపడిందని పలువురు వ్యాఖ్యానించారు. శుక్రవారం రాత్రి విడుదల చేసిన మెరిట్ జాబితాలో అభ్యర్థులకు వచ్చిన మార్కుల ప్రకారం ర్యాంకులు ప్రకటించారు. దాని ప్రాతిపదికగా రోస్టర్ పాయింట్లు ఉపయోగించి సెలక్షన్ జాబితా సిద్ధం చేస్తున్నారు. రోస్టర్ ఆధారంగా కటాఫ్ మార్కులు నిర్ణయించి ఆదివారం లేదా సోమవారం సెలక్షన్ జాబితా విడుదల చేయనున్నారు. సెలక్షన్ జాబితా మేరకు అభ్యర్థులకు కాల్ లెటర్స్ పంపించనున్నారు. కాల్ లెటర్ వచ్చిన అభ్యర్థులు మాత్రమే సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాల్సి ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో జడ్పీ, మునిసిపల్, ప్రభుత్వ పాఠశాలలు, గిరిజన సంక్షేమ శాఖ, జువెనైల్ శాఖలలో పోస్టుల భర్తీ, జోన్ పరిధిలో గురుకులాల్లో టీజీటీ, పీజీటీ, ప్రిన్సిపాళ్ల నియామకాల కోసం అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన విద్యా శాఖ పరిధిలో జరగనున్నది. విశాఖ ఉక్కు నగరంలోని విమల విద్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలన చేస్తారు. సర్టిఫికెట్ల పరిశీలనలో పాల్గొనే ఎంఈవోలు, హెచ్ఎంలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శనివారం విశాఖ విమల విద్యాలయంలో శిక్షణ ఇచ్చారు. సర్టిఫికెట్ల పరిశీలన ఎప్పుడు జరిపేది ఆదివారం ప్రకటించనున్నారు. ఏ పోస్టుకు ప్రాధాన్యం ఇస్తున్నారో దరఖాస్తు చేసే సమయంలోనే అభ్యర్థులు ఆప్షన్ ఇచ్చారు. దీని ప్రకారం సదరు అభ్యర్థికి వచ్చిన మార్కుల ప్రాతిపదికగా పోస్టులో నియమిస్తారు. ఆ తరువాత ఆయా యాజమాన్యాలు ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగ్స్ ఇచ్చి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు పాఠశాల విద్యా శాఖ ఆర్జేడీ విజయభాస్కర్ తెలిపారు. కాగా ఉమ్మడి జిల్లాలో మెరిట్ జాబితా మేరకు ఏ ర్యాంకు వరకు పోస్టులు తీస్తారనే చర్చ అభ్యర్థుల్లో సాగుతుంది. దీనిపై రకరకాలుగా అభ్యర్థులు, నిపుణులు లెక్కలు కడుతున్నారు. అయితే ఏ ర్యాంకు వరకూ ఉద్యోగం గ్యారంటీ అనేది స్పష్టంగా చెప్పలేమని, అది పోస్టులను బట్టి ఉంటుందని విద్యా శాఖకు చెందిన ఒక అధికారి తెలిపారు. ఉదాహరణకు స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కేటగిరీలో 139 పోస్టులు ఉన్నాయి. అందులో సగం రిజర్వేషన్‌కు వెళతాయి. దీనిని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా కటాఫ్‌కు దగ్గరగా ఉన్న వారిలో మాత్రం కొంత ఉత్కంఠ ఉందని, బహుశా ఆదివారం లేదా సోమవారం పూర్తిగా స్పష్టత వస్తుందని అన్నారు.

ఉక్కు క్యాంటీన్‌లలో సౌకర్యాలు పెంచాలని వినతి

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో క్యాంటీన్‌లను అందుబాటులో ఉంచి సౌకర్యాలు పెంచాలని గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కేఎస్ఎన్.రావు ఉక్కు యాజమాన్యానికి శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ప్రైవేటు క్యాంటీన్‌లను తీసేయడంతో ఉద్యోగులకు కావాల్సిన టీ, టిఫిన్, ఇతర తిండి పదార్థాలు లభ్యమవడంలేదని, ప్లాంట్ క్యాంటీన్‌లలో అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్లాంట్ క్యాంటీన్‌లను 24 గంటలూ నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. అదే విధంగా కీలక జంక్షన్‌లు, విభాగాల్లో టీ పాయింట్‌లను ఏర్పాటు చేయాలని కోరారు.

రక్తదాన శిబిరానికి స్పందన

అగనంపూడి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మకుమారీస్ సంస్థ స్థానిక శాఖ ఆధ్వర్యంలో శనివారం బీసీ కాలనీలో దివ్య జ్యోతి భవనం వద్ద ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో యువత స్వచ్ఛందంగా పాల్గొని రక్తాన్ని దానం చేశారు. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మిప్రసాద్, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సుధాకరరెడ్డికి నివాళి

పెదగంట్యాడ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సీపీఐ అగ్రనేత సురవరం సుధాకరరెడ్డికి పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న సీపీఐ నాయకులు నివాళులు అర్పించారు. పెదగంట్యాడ పోతిన సన్యాసిరావు భవన్‌లో శనివారం నిర్వహించిన సుధాకరరెడ్డి సంతాప కార్యక్రమంలో సీపీఐ నాయకులు యెల్లేటి శ్రీనివాసరావు, పల్లేటి పోలయ్య, జి. ఆనంద్, కె. పోతయ్య, పి. దుర్గారావు, మాధవరావు పాల్గొని నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సుధాకరరెడ్డి ప్రజలకు, పార్టీకి చేసిన సేవలను కొనియాడారు.

పరిశ్రమల్లో అవకాశాలను అందిపుచ్చుకోవాలి

ఐఐటీ ఖరగ్‌పూర్ ప్రొఫెసర్ వంశీకృష్ణ

అగనంపూడి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో ఉన్న ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా విద్యార్థులు స్కిల్స్ నేర్చుకోవాలని ఐఐటీ ఖరగ్‌పూర్ ప్రొఫెసర్ వంశీకృష్ణ సూచించారు. విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఐఈఈఈ బ్రాంచ్ విద్యార్థుల సహకారంతో పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలపై సెమినార్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన పరిశ్రమల్లో గల ఉద్యోగాల గూరించి విద్యార్థులకు వివరించారు. అనంతరం విజ్ఞాన్ యాజమాన్య ప్రతినిధులు వంశీకృష్ణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్ రెక్టార్ వి. మధుసూదనరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాలభైరవుడికి ప్రత్యేక పూజలు

పెదగంట్యాడ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 65వవార్డు గరుడాద్రిపై కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరాలయం ఆవరణలోని కాలభైరవ స్వామికి శనివారం ప్రత్యేక పూజలు, క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అన్నసమారాధన నిర్వహించింది.

సినిమా గైడ్

- **పరదా** : శారద, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **మేఘాలు చెప్పిన ప్రేమకథ** : రమాదేవి, మోహిని (గాజువాక)
- **బన్ బట్టర్ జామ్** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య హెవెన్ (గాజువాక)
- **యూనివర్సిటీ** : శ్రీకాంతి
- **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
- **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 24, టమాటా 50, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 40, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 30, బీరకాయలు 48, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 46, దొండకాయలు 32, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది) 74, బరబాటి 36, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 110, కీరదోస 32, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 46, కంద 40, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230



వుడా ఫేజ్-5లో పైపు నుంచి లీక్ అవుతున్న తాగునీరు



తిరుమల నగర్ కాలువలో కలుస్తున్న తాగునీరు



నాగేంద్రకాలనీ ప్రధాన రహదారిలో వృథాగా పోతున్న నీరు

వార్డుల్లో వృథాగా పోతున్న తాగునీరు

» పైపు లైన్లకు లీకేజీల కారణం » బిందెడు నీటి కోసం అల్లాడుతున్న ప్రజలు » అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలని వేడుకోలు

కూర్మన్నపాలెం/గోపాలపట్నం ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూస్తామని అధికారులు హామీలు ఇస్తున్నారు. కానీ క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే పరిస్థితి మహా దారుణంగా ఉంది. ముఖ్యంగా 86, 87, 89వ వార్డుల కాలనీలకు సరిపడ తాగునీరు సరఫరా జరగడం లేదని ఆయా కాలనీల మహిళలు ఆరోపిస్తున్నారు. బిందెడు నీటి కోసం మహిళలు అగచాట్లు పడుతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారు. నాణ్యత లేని పైపులు వేయడం, అవి ఎప్పటికప్పుడు పగలడం, దీంతో తాగునీరు నేల పాలవుతోంది. నీళ్లు ఎప్పుడు వస్తాయో తెలియక మహిళలు గగ్గోలు పెడుతున్నారు. 86వ వార్డు రాజీవ్ నగర్ తాగునీరు చాలక మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విషయాన్ని టీడీపీ నాయకుల దృష్టికి తీసుకువెళితే సమస్యను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామ హామీలు ఇస్తున్నారు. కానీ ఎటువంటి మార్పులేదు. 87వ వార్డు తిరుమలనగర్‌లో పలు కాలనీల రహదారుల్లో 10చోట్ల ఎప్పటికప్పుడు పైపులు పగిలి తాగునీరు డ్రైనేజీ పాలవుతోంది. కలుషితమైన నీరు తాగడం వల్ల ప్రజలు అనారోగ్య బారిన పడుతున్నారు. నీళ్లు వచ్చాయని వెళ్లి రెండు మూడు బిందెలు పట్టుకునేలోపే సరఫర నిలిచిపోతోందని మహిళలు ఆ వేదన వ్యక్తం చేస్తున్నారు. కాలకృత్యాలు తీర్చుకోవడానికి సమీప బోర్ల దగ్గర నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఒకవైపు నీరు సరిపోక ప్రజలు గగ్గోలు పెడుతుంటే, మరోవైపు నీరు వృథాగా పోతోంది. వార్డులో నీటి సమస్యలుపై ఫిర్యాదులు రావడంతో కార్పొరేటర్ బొండా జగన్ తాగునీటి సరఫరాను పర్యవేక్షించారు. తమ వార్డులో నీటి సిబ్బంది కేవలం 2 రౌండ్ల నీరు విడుదల చేస్తున్నారని గ్రహించారు. దీంతో 86వ వార్డుకు 50 రౌండ్ల నీరు సరఫరా చేస్తున్నారని జీవీఎంసీ కమిషనర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి స మస్యను వివరించారు. 87వ వార్డులో మరో 12 ఎండీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఆవశ్యకత గురించి వివరించారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని కోరుతున్నారు.

ఫిర్యాదు చేసినా ప్రయోజనం శూన్యం



రెండు నెలలుగా పైప్‌లైన్ పగిలిపోయి తాగునీరు వృథాగా పోతోంది. అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసినా ప్రయోజనం శూన్యం. కొళాయిలు ద్వారా వచ్చే నీరు కూడా కొంత సమయం మాత్రమే సరఫరా అవుతోంది. జనాభాకు అనుగుణంగా మంచినీటి సరఫరా చేయడం లేదు. మంచి నీటి విభాగం అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టాలి.

-జి.విశ్వేశ్వరరావు (తిరుమల నగర్)



ద్వారం దుర్గాప్రసాద్‌రావుకు స్వర్ణకమలం బహూకరిస్తున్న వైభవ్ జ్యువెలర్స్ అధినేత్రి గ్రంధి మల్లికామనోజ్

కళాభారతి 24వ జాతీయ ఉత్సవాలు ప్రారంభం

విశాఖపట్నం ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురంకాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో శనివారం కళాభారతి 24వ జాతీయ పురస్కారాల ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు కళాభారతి నిర్వాహకులు హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి సోమయాజులు సమక్షంలో ప్రముఖ వయోలిన్ విద్వాంసులు ద్వారం దుర్గాప్రసాద్‌రావుకు నాద విద్యాభారతి బిరుదు ప్రదానం చేశారు. అలాగే రూ.లక్ష నగదు, నూతన వస్త్రాలతో దుర్గాప్రసాద్‌రావు దంపతులకు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు వైభవ్ జ్యువెలర్స్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ గ్రంధి మల్లికామనోజ్ స్వర్ణకమలం బహూకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కళాకారులను ప్రోత్సహించడం తమ బాధ్యతగా భావిస్తున్నామన్నారు. భవిష్యత్‌లో కూడా కళలు, కళాకారులను ప్రోత్సహించడంలో వైభవ్ సహకారం ఉంటుందన్నారు. రిటైర్డ్ జడ్జి సోమయాజులు మాట్లాడుతూ 24 ఏళ్లుగా కళలను ప్రోత్సహించడంలో కళాభారతి నిర్వాహకులు చూపుతున్న చొరవ ఎంతోమందికి ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో కళాభారతి అధ్యక్షుడు మంతెన సత్యనారాయణరాజు, కార్యదర్శి గుమ్మలూరి రాంబాబు, పైడా కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

దత్తత గ్రామాల అభివృద్ధిపై సమగ్ర చర్చ

విశాఖపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఏయూ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ చైర్ దత్తత తీసుకున్న పినగాడి, గొంపల్లి, రాంపురం, కరకవానిపాలెం, కోటవానిపాలెం గ్రామాల ప్రతినిధులతో ప్రొఫెసర్ ఎం.జేమ్స్ స్టీఫెన్ శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'అంబేడ్కర్ హెల్పింగ్ హ్యాండ్స్' ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. తమ గ్రామాల్లో మంచినీటి సమస్యలు పరిష్కరించాలని గ్రామాల ప్రతినిధులు విన్నవించారు. ఈ సమావేశంలో గ్రామాల ప్రతినిధులు బి.భగవాన్ జయరాం, గొరపల్లి శ్రీను, రెడ్డి నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో వీఎస్ఈజెడ్ ఎగుమతులు



ముప్పాళ్ల శ్రీనివాస్

కూర్మన్నపాలెం,ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ వీఎస్ఈజెడ్ మూడవ త్రైమాసికంలో రికార్డు స్థాయిలో ఎగుమతులు సాధించినట్లు వీఎస్ఈజెడ్ జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ముప్పాళ్ల శ్రీనివాస్ తెలిపారు. వీఎస్ఈజెడ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సేవా రంగంలో రూ.42,766 కోట్లు, వస్తు రూపంలో రూ.15,779 కోట్లు, ఎగుమతులతో రూ.58,565 రాబట్టామని అన్నారు. కాగా, దువ్వాడ సెజ్ పరిధిలో వస్తువుల ఎగుమతులు రూ.1832 కోట్లు, సేవా రంగం ఎగుమతులు రూ.1.93 కోట్లుతో కలిపి రూ.1,834 కోట్లుతో 156 శాతం అంచనాలకు మించి ఎగుమతులు చేసినట్టు వెల్లడించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 9.82 వృద్ధి రేటు సాధించామన్నారు. ఆంధ్రాలో 2, తెలంగాణాలో 7 కొత్త సెజ్ యూనిట్లు ఏర్పాటు చేయాడానికి ప్రతిపాదనలకు ఆమోదం తెలిపామన్నారు. నూతనంగా ఆమోదించిన సెజ్ యూనిట్లు రూ.1303.05 కోట్లు పెట్టుబడి, 5469 మందికి ఉపాధిని కల్పిస్తాయన్నారు. మార్చి 31 నాటికి వీఎస్ఈజెడ్ రూ.1,26,635.46 కోట్ల పెట్టుబడులను ఆకర్షిస్తుందని, 6,03,474 మందికి ఉపాధి కల్పిస్తుందన్నారు.

వాడవాడలా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర

అగనంపూడి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నదని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపీకృష్ణ సూచించారు. స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.



అగనంపూడిలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర ర్యాలీ చేస్తున్న దృశ్యం

సింధియా, (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరమని 63వ వార్డు కార్పొరేటర్ గల్లా పోలిపల్లి(చిన్నా) అన్నారు. వార్డులోని జైంద్రకాలనీలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర, కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమ్మంగా ఉండాలని సూచించారు. అనంతరం ప్రజలతో స్వచ్ఛ-సంరక్షణ కోసం ప్రతిజ్ఞ చేయించారు.

పరిసరాల పరిశుభ్రతే సమాజ ప్రగతి

పెదగంట్యాడ, (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతే సమాజ ప్రగతికి సూచికని జీవీఎంసీ సహాయ వైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్, 74వవార్డు కార్పొరేటర్ తిప్పల.వంశీరెడ్డి అన్నారు. దయాళ్ క్వారీ రోడ్డులో శనివారం నిర్వహించిన స్వచ్ఛసర్వేక్షణ్, స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు ఇంటిముందుకు వచ్చే ప్రజారోగ్య శాఖ వాహనానికి తడి పొడి చెత్తలను వేరు చేసి ఇవ్వాలని సూచించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నదని, వాటిని నివారించేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులను కోరారు. అనంతరం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటామని స్థానికుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పలరాజు, వార్డు అధ్యక్షుడు పల్లా రమణ, సచివాలయ ఉద్యోగులు, శానిటరీ విభాగం ఉద్యోలు పాల్గొన్నారు.

ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలి : ట్రాఫిక్ సీఐ కె.వెంకట్రావు

కూర్మన్నపాలెం,ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని, రహదారి భద్రతా నియమాలను తప్పకుండా పాటించాలని దువ్వాడ ట్రాఫిక్ సీఐ కె.వెంకట్రావు ప్రీపేయిడ్ ఆటోస్టాండులో డ్రైవర్లకు సూచించారు. దువ్వాడ రైల్వే స్టేషన్ నాలుగో ప్లాట్‌ఫాం వద్ద ఆటో డ్రైవర్లకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు పట్ల అప్రమత్తంగా ఉండాలని, అదనపు చార్జీలు వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదులు లేకుండా చూసుకోవాలని, లైసెన్స్, సీబుక్, యూనిఫారమ్, పొల్యూషన్, ఇన్సూరెన్స్ పత్రాలు నిత్యం వెంట ఉంచుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని, రోడ్డు డిసిప్లేన్ పాటించాలని సూచించారు. అనంతరం ఆటో డ్రైవర్ల చేత రహదారి నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్ విభాగాధిపతికి సత్కారం

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్ నూతన విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన ఎ.రవికుమార్‌ను ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కార్యవర్గం సభ్యులు శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా కార్యవర్గ ప్రతినిధులు మాట్లాడుతూ ప్లాంట్‌కు కీలకమైన ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్ విభాగాధిపతిగా రావడం ఆనందనీయమని అన్నారు. ఉద్యోగుల ప్రధాన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. అధికారులు, ఉద్యోగులు సమిష్టిగా విధులు నిర్వహించి, ఉత్పత్తి పెంచాలని రవికుమార్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గం ప్రతినిధులు పాల్గొన్నారు.

పరిసరాలు స్వచ్ఛంగా ఉంటేనే ఆరోగ్యం: గణబాబు



స్వచ్ఛాంధ్ర..స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు తదితరులు

గోపాలపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా మూడో శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర..స్వర్ణాంధ్ర కార్యక్రమం గ్రేటర్ పరిధి 91వ వార్డులో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు మాట్లాడుతూ విశాఖను స్వచ్ఛనగరాల్లో ప్రథమ స్థానంలో నిలపడానికి ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. పరిసరాల పరిశుభ్రతకు కృషిచేస్తున్న ప్రజారోగ్య విభాగ సిబ్బందికి సహకరించాలని కోరారు. వ్యాధులు ప్రబలకుండా జీవీఎంసీ అధికారులు చేసిన సూచనల్ని ప్రతి ఒక్కరూ పాటించాలని పిలుపునిచ్చారు. ఏఎంహెచ్‌వో అప్పలనాయుడు కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వార్డు అధ్యక్షుడు ఎన్.సత్తిరాజు, జీవీఎంసీ అధికారులు, ప్రజారోగ్య విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

రైతుబజార్‌లో.. స్థానిక రైతుబజార్‌లో జరిగిన స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా రైతులు, వర్తకులు బజారు ప్రాంగణంలో పారిశుధ్య పనులు నిర్వహించారు. మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ సుధాకర్, ఏడీఎం శ్రీనివాస్ కిరణ్, సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి రవికుమార్‌లు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఎస్టేట్ అధికారి ప్రసాద్ ప్రతిజ్ఞ చేయించారు.

89వ వార్డులో.. స్థానిక గణపతినగర్‌లో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ అవగాహన కల్పించారు.

పరిశుభ్రతపై అవగాహన

మల్కాపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 58వ వార్డు గుల్లలపాలెంలో పరిశుభ్రతపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్ శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. పరిశుభ్రతకు పెద్దపీట వేస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. పరిశుభ్రత పాటిస్తే వ్యాధులను నివారించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి, టీడీపీ వార్డు అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు, మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ పొత్తబత్తుల శ్రీనివాసరావు, మలేరియా, శానిటేషన్ సిబ్బంది, ఆశ వర్కర్లు, ఆర్పీలు, స్థానికులు పాల్గొన్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

విశాఖపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ అవుట్‌గేట్ దగ్గర ఉన్న స్పైసీ బిర్యాని హౌస్‌లోని శనివారం రాత్రి ఫుడ్‌సేఫ్టీ అధికారులు దాడులు నిర్వహించారు. బిర్యాని హౌస్‌లోని ఫ్లోరింగ్, టైల్స్, వాల్స్ డ్రైనేజీ సిస్టమ్ చూసి అవాక్కయ్యారు. దీంతో పాటు మెడికల్ సర్టిఫికెట్, వాటర్ సప్లయ్ అనుమతులు లేకపోవడం గుర్తించారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ అధికారి జీవీ అప్పారావు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైడ్ నిర్వహించినట్టు చెప్పారు. స్పైసీ బిర్యానీ హౌస్‌కు సంబంధించి చాలా వరకు అనుమతులు లేవన్నారు. వారం రోజుల్లో తాము చెప్పిన అనుమతులు అన్నీ తీసుకోవాలని, లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.



ఫుడ్ శాంపిల్స్ సేకరిస్తున్న అధికారులు

అలాగే ఇక్కడ వండిన చికెన్ బిర్యాని, పౌడర్లపై కూడా శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపుతున్నట్టు వెల్లడించారు. రెస్టారెంట్ నిర్వాహకులు కచ్చితంగా ఫుడ్‌సేఫ్టీ నియమ నిబంధనలు, ఆహార నాణ్యత పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఫుడ్‌స్టేఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న బొమ్మిడి రమణ తదితరులు

ఎన్.ఎ.డి.జంక్షన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు కాకానీనగర్ దరి కనకమహాలక్ష్మీనగర్‌లో రూ.19.5 లక్షలతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు కార్పొరేటర్ బొమ్మిడి రమణ శనివారం శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించి ముందుకు సాగుతోందన్నారు. వార్డులో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఏఈ వెంకటలక్ష్మి, టీడీపీ నాయకులు శరగడం అరుణ్‌కుమార్, ఎలమంచిలి ప్రసాద్, పైడిరాజు పాల్గొన్నారు.

మంచినీటి సౌకర్యం కల్పించాలని ధర్నా



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

వేపగుంట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 94వ వార్డు బంటాకాలనీ ఎగువ ప్రాంతంలో ఉన్న చైతన్యనగర్ కాలనీకి మంచినీటి సదుపాయం కల్పించాలని సీపీఎం గోపాలపట్నం జోన్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. మంచినీటి సదుపాయం కోసం గతంలో అనేకమార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. 15 రోజుల నుంచి కింది ప్రాంతమైన బంటాకాలనీకి కూడా నీటిసదుపాయం అంతంత మాత్రం ఉండటంతో అక్కడ నివాసం ఉండే అసంఘటిత కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్యాంకర్ లేదా పైపులైన్ వేసి నీటి సదుపాయం కల్పించకపోతే 50 కుటుంబాల వారు జోనల్ కార్యాలయం ఎదుట బైఠాయిస్తామని హెచ్చరించారు. అనంతరం జెడ్సీ కె.హైమావతికి వినతిపత్రం అందజేశారు. సీపీఎం జోన్ కమిటీ నాయకులు వెంకటలక్ష్మి వెంకటరావు, అప్పలనాయుడు, ప్రసాద్ పాల్గొన్నారు.

మహర్తి మాతృమూర్తి కన్నుమూత

పెందుర్తి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి వెంకటాద్రి ఆలయ ప్రధాన అర్చకులు మహర్తి రామానుజాచార్యులు మాతృమూర్తి రాజమ్మ కన్నుమూశారు, కొంత కాలంగా అస్వస్థతతో ఉన్న ఆమె శనివారం తెల్లవారుజామున స్వగృహంలో మృతి చెందారు. రాజమ్మ భౌతికకాయాన్ని స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబసభ్యులను పరామర్శించారు. రాజమ్మ భౌతికకాయాన్ని పలువురు సందర్శించి ఆమె మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

హైవే దోపీడీలపై పోలీసులు అలర్ట్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెందుర్తి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి హైవేలో దోపిడీలపై గురువారం 'ఆంధ్రజ్యోతి'లో 'హైవేపై హడలెత్తిస్తున్న దోపిడీలు' శీర్షికన వార్త ప్రచురితం కావడంతో పెందుర్తి పోలీసులు స్పందించారు. దోపిడీల నియంత్రణకు హైవేపై భద్రతను కట్టుదిట్టం చేశారు. సీఐ కెవీ సతీశ్‌కుమార్ ఆదేశాలతో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారు జాము వరకు పోలీసు గస్తీని ముమ్మరం చేశారు. హైవే పెట్రోలింగ్ పోలీసులను అప్రమత్తం చేశారు. హైవేపై దుండగుల దోపిడీ చేసే ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే గంజాయి బ్యాచ్‌పై నిఘా పెట్టారు. ఏ సమయంలో పోలీసులకు ఫోన్ చేసినా తక్షణమే స్పందిస్తామని సీఐ సతీశ్‌కుమార్ తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ములగాడ మండల ప్రత్యేకాధికారిణి కేవీ రామలక్ష్మి

మల్కాపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ములగాడ మండల ప్రత్యేకాధికారిణి కేవీ రామలక్ష్మి శనివారం మల్కాపురం ప్రాంతంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె అంగన్‌వాడీ కార్యకర్తలకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు మంచి పౌష్టికాహారం అందేలా చూడాలని తెలిపారు. అనంతరం మల్కాపురం ప్రాంతంలో ఉన్న జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలను కూడా పరిశీలించారు. ఈ పాఠశాలలో విద్యాబోధన జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వహించాలని అన్నారు.

ఆడారి ఆనంద్‌కు సన్మానం



ఆనంద్‌కుమార్‌ను అభినందిస్తున్న కలిదండి బద్రీనాథ్ తదితరులు

మల్కాపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితుడైన ఆడారి ఆనంద్‌కుమార్‌ను బీజేపీ నగర ఉపాధ్యక్షుడు కలిదండి బద్రీనాథ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్, బద్రీనాథ్‌లు మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. బీజేపీలో చేరేందుకు అనేక మంది ఆకర్షితులవుతున్నారని అన్నారు. పారిశ్రామిక ప్రాంతంలో ఇది మరింత ఎక్కువగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బిల్డర్ సంతోష్, సురాడ అనుదీప్, సురేష్, పలువురు యువకులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు, హెల్పర్లకు నేత్ర పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

మల్కాపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కోరమాండల్ ఎరువుల కర్మాగారం ట్రక్ డ్రైవర్లు, హెల్పర్లు మొత్తం 310 మంది కన్ను, గుండె స్క్రీనింగ్ పరీక్షలు శనివారం చేయించుకున్నారు. ఇందులో 133 మందికి కంటి అద్దాలు ఇచ్చారు. ఇద్దరు డ్రైవర్లకు కేటరాక్ట్ సమస్యను గుర్తించారు. 90 మంది డ్రైవర్లకు ఈసీజీ, ఎ2డి, ఈసీవో పరీక్షలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ యూనిట్ హెడ్ సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. ట్రక్ డ్రైవర్లు, హెల్పర్ల ఆరోగ్య భద్రతకు సంస్థ అనేక చర్యలు తీసుకుంటోందని తెలియజేశారు. కోరమాండల్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కేవీవీఎస్ నారాయణ, సీనియర్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ రంగనాయకులు, కమర్షియల్ డిపార్ట్‌మెంట్ హెడ్ లక్ష్మీనారాయణ, ఈహెచ్ఎస్ హెడ్ నాగరాజు, డాక్టర్లు ఉదయ్, హేమంత్, ముఖ్యభద్రత అధికారి నారాయణపాత్రుడు, సీఎస్ఆర్ డిప్యూటీ మేనేజర్ శేషపు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం

గోపాలపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలాజీ స్కూల్‌లో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సైన్స్ అధ్యాపకులు అంతరిక్ష పరిశోధనలో శాస్త్రవేత్తల కృషిని వివరించారు. విద్యార్థులు దేశాభివృద్ధికి దోహదపడే ఆవిష్కరణలు చేయడానికి కృషి చేయాలని పిలుపుచ్చారు. సీవీ రామన్, అబ్దుల్ కలాం వంటి మహనీయుల్ని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.


జైలు వద్ద బారులుతీరిన ఖైదీల బంధువులు

కేంద్ర కారాగారంలో ములాఖత్‌కు సర్వర్ సమస్య

ఆరిలోవ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : విశాఖ కేంద్ర కారాగారంలో ఉన్న రిమాండ్, శిక్ష పడిన ఖైదీలను చూసేందుకు జైలు వద్దకు ములాఖత్‌కు శనివారం వచ్చిన వారంతా సాంకేతిక సమస్య ఎదురవడంతో ఇబ్బందులు పడ్డారు. ములాఖత్ కోసం ఉదయమే జైలు వద్దకు ఖైదీల కుటుంబ సభ్యులు, బంధువులు చేరుకున్నారు. కొంతమంది ఖైదీల బంధువులు చంటిపిల్లలతో వచ్చి ఇక్కడి షెడ్లల్లో కూర్చొని ఆపసోపాలు పడ్డారు. ఉదయం 11 గంటల తరువాత సర్వర్ సమస్య పరిష్కారం కావడంతో ములాఖత్‌కు జైలు అధికారులు అవకాశం కల్పించారు. నిబంధనల మేరకు సాయంత్రం ఐదు గంటల వరకు ములాఖత్ సాగింది.

డీఎస్సీలో సత్తా చాటారు

రాష్ట్ర, జోన్, జిల్లా స్థాయిలో మెరుగైన ర్యాంకులతో ఉద్యోగాల సాధన

రెండు, మూడు కేటగిరీల్లో టాప్ ర్యాంకులు సాధించిన పలువురు అభ్యర్థులు

విశాఖపట్నం/అనకాపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి- న్యూస్ నెట్‌వర్క్):

మెగా డీఎస్సీ ఫలితాల్లో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన పలువురు అభ్యర్థులు సత్తా చాటారు. రాష్ట్ర, జోన్, జిల్లా స్థాయిలో మెరుగైన ర్యాంకులు సాధించి ప్రతిభను కనబరిచారు. పలువురు అభ్యర్థులు రెండు, మూడు కేటగిరీల్లో టాప్ ర్యాంకులు సాధించి ఆయా కేటగిరీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిలో సాధారణ, నిరుపేద కుటుంబాలకు చెందిన ఎంతోమంది అభ్యర్థులు ఉన్నారు. ఆటో డ్రైవర్, రోజువారీ కూలీ పనులు చేసుకునే వారి కుమార్తెలు టాప్ ర్యాంకులను సాధించడంతో పాటు మూడు కేటగిరీల్లో ఉద్యోగాలకు ఎంపికై సత్తా చూపారు. కుటుంబ సభ్యుల సహకారం, స్పష్టమైన ప్రణాళికతోనే ఉద్యోగాలను సాధించినట్టు పలువురు అభ్యర్థులు పేర్కొన్నారు.

మద్యం దుకాణంలో సూపర్‌వైజర్.. నేడు వ్యాయామ ఉపాధ్యాయుడు

» తురువోలుకు చెందిన గుంపెన శివరామకృష్ణ



చోడవరం: వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం దుకాణంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ఓ యువకుడికి నేడు కూటమి ప్రభుత్వంలో ఉపాధ్యాయ ఉద్యోగం లభించింది. చీడికాడ మండలం తురువోలుకు చెందిన గుంపెన శివరామకృష్ణ డీఎస్సీ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫలితాల్లో ఉమ్మడి జిల్లా ఓపెన్‌లో 27వ ర్యాంకు సాధించాడు. ఈయన తండ్రి ఆర్టీసీ డ్రైవర్. రామకృష్ణ వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం దుకాణంలో సూపర్‌వైజర్‌గా పనిచేశారు. అయితే ప్రభుత్వ మద్యం దుకాణాలు తీసివేయడంతో ఇతని కొలువు పోయింది. కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో రామకృష్ణకు వ్యాయాయ ఉపాధ్యాయ పోస్టు రావడం గమనార్హం. రామకృష్ణకు భార్య, ముగ్గురు పిల్లలు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేయాలన్న నా కల నెరవేరిందని రామకృష్ణ ఆనందం వ్యక్తం చేశారు.

గృహిణి పరమేశ్వరికి ఓపెన్‌లో జిల్లా స్థాయిలో 27వ ర్యాంకు

చోడవరం: పట్టణ శివారు అన్నవరం గ్రామానికి చెందిన పందిరి పరమేశ్వరి డీఎస్సీ సోషల్ అసిస్టెంట్ విభాగంలో ఉమ్మడి జిల్లా ఓపెన్ మహిళల కోటాలో 27వ ర్యాంకు సాధించి సత్తాచాటింది. పరమేశ్వరికి భర్త శ్రీనివాసరావు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న పట్టుదలతో


భర్త ఇద్దరు పిల్లలతో గృహిణి పందిరి పరమేశ్వరి

కఠినంగా శ్రమించిన పరమేశ్వరి ఎట్టకేలకు తన కోరిక నెరవేర్చుకున్నారు. కష్టపడి చదివి విజయం సాధించడంపై స్థానికులు కుటుంబ సభ్యులు ఆమెను అభినందనలతో ముంచెత్తుతున్నారు.

పండ్ల వ్యాపారికి 42వ ర్యాంకు



నర్సీపట్నం: కూటమి ప్రభుత్వం నిర్వ హించిన డీఎస్సీ సెకం డరీ గ్రేడ్‌లో నర్సీపట్నానికి చెందిన విరోధి తరుణ్‌కుమార్ 42వ ర్యాంకు సాధించాడు. ఈయన ఆర్డీవో కార్యాలయానికి వెళ్లే రోడ్డులో అతని సోదరుడుతో కలిసి పండ్ల వ్యాపారం చేస్తుంటాడు. ఈయన స్థానిక బీఆర్‌కాలేజీలో టీటీసీ పూర్తి చేశాడు. తండ్రి కాగితలరాజు పండ్ల వ్యాపారి, తల్లి లక్ష్మి గృహిణి. నిరుపేద కుటుంబానికి చెందిన తరుణ్ 42వ ర్యాంకు సాధించడంతో పలువురు అభినందిస్తున్నారు.

తల్లి కష్టానికి దక్కిన ఫలితం..



గొలుగొండ: డీఎస్సీ సెకండరీ గ్రేడ్‌లో మండలంలోని జోగంపేటకు చెందిన పసగొడుగుల సాయికుమార్‌కు జిల్లాలో 22వ ర్యాంకు సాధించాడు. నిరుపేద కుటుంబానికి చెందిన సాయికుమార్‌కు తండ్రి చిన్నతనంలోనే మృతి చెందాడు. తల్లి రాజేశ్వరి రెక్కల కష్టంతో చదువుకుని 22వ ర్యాంకు సాధించాడు. దీంతో స్థానికులు సాయికుమార్‌కు అభినందనలు తెలిపారు.

పేదింటి విద్యా కుసుమం



దేవరాపల్లి: దేవరాపల్లికి చెందిన కాటపల్లి రవిశంకర్ ఉమ్మడి జిల్లాలో ఎస్‌జీటీ ఓపెన్ కేటగిరిలో 89.99 మార్కులతో 23వ ర్యాంకు సాధించాడు. ఈయన తల్లి మంగమ్మ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, తండ్రి అచ్చి బాబు భవన కార్మికుడిగా పనిచేస్తున్నాడు.

రాణించిన రైతు కుమార్తె

దేవరాపల్లి: మండలంలోని ఎం.అలమండలో సామాన్య రైతు కుటుంబానికి చెందిన



కామిరెడ్డి రమణ, రాజులమ్మ కుమార్తె రాధ ఒకేసారి రెండు ఉద్యోగాలు సాధించింది. ఇటీవల ఆమె సిటీ సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయింది. తాజాగా ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో 86.09 మార్కులు సాధించి ఉమ్మడి జిల్లాలో ఎస్‌జీటీలో 69 ర్యాంకు సాధించింది.

శ్వేత సాధించింది..



దేవరాపల్లి: మండలంలోని మారేపల్లికి చెందిన సియాద్రి మంజీరా శ్వేత ఎస్‌సీ కేటగిరిలో హిందీ పోస్టుకు అర్హత పొందింది. ఈమె 66.78 మార్కులతో ఉమ్మడి విశాఖ జిల్లాలో 62వ ర్యాంకు సాధించింది. ఈమె తల్లి సన్యాసమ్మ అంగన్‌వాడీ కార్యకర్త కాగా, తండ్రి త్రినాథ రావు ప్రైవేటు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు.

- నాగయ్యపేటకు చెందిన కొడమంచిలి.శివ 86.63 మార్కులతో ఉమ్మడి జిల్లాలో 55 ర్యాంకు సాధించాడు. ఎస్‌జీటీలో ఉపాధ్యాయ కొలువు పొందాడు. తల్లిదండ్రులు కుల వృత్తి చేసుకొని జీవిస్తున్నారు.
- ఇదే గ్రామానికి చెందిన చుక్కా దుర్గారావు వ్యాయామ ఉపాధ్యాయుడుగా 85 మార్కులతో 13 ర్యాంకు సాధించాడు. వీరంతా ప్రభుత్వ కొలువుల్లో అర్హత సాధించారు. కూటమి ప్రభుత్వంలో ఉపాధ్యాయ ఉద్యోగాలు వచ్చాయని వారంతా ఆనందం వ్యక్తం చేశారు.

భర్త సహకారంతోనే..

- కామిశెట్టి భాను పుష్ప, నాతయ్యపాలెం



నగరంలోని నాతయ్యపాలేనికి చెందిన కామిశెట్టి భాను పుష్ప డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ కేటగిరిలో 65.80 మార్కులు (139వ ర్యాంకు) సాధించారు. ఎంఏ (ఇంగ్లిష్) బీఈడీ చేసిన భాను ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. కోచింగ్ సెంటర్లకు వెళ్లకుండా ఇంటి వద్దే డీఎస్సీకి ప్రిపేరై భర్త రాజు సహకారంతో మొదటి విడతలోనే ఉద్యోగానికి ఎంపికవ్వడం ఎంతో ఆనందంగా ఉందని భాను తెలిపారు.

మెరిసిన లావణ్య

నక్కపల్లి: మండలంలోని గొడిచెర్ల గ్రామానికి చెందిన చెల్లపు లావణ్య ఎస్‌జీటీలో 91 శాతం మార్కులు సాధించి జిల్లాలో ఏడవ స్థానంలో నిలిచింది. వ్యవసాయ కుటుంబానికి



చెందిన హనుమంత రావు, నాగమణి దంపతుల కుమార్తె లావణ్య గొడిచెర్ల ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంది. డీఎస్సీలో సత్తా చాటిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీచర్ కావాలనే లక్ష్యంతో కష్టపడి చదివానని, మంచి ఫలితం రావడం ఆనందంగా ఉందన్నారు.

నానమ్మ, అమ్మమ్మల ప్రోత్సాహంతో..



నక్కపల్లి: మండలంలోని దోసలపాడు గ్రామానికి చెందిన భవిరిశెట్టి రామకృష్ణ ఎస్‌జీటీలో రెండవ ర్యాంకు సాధించారు. చిన్నతనంలోనే తల్లిదండ్రులకు కోల్పోగా, నానమ్మ, అమ్మమ్మల ప్రోత్సాహంతో బీఈడీ వరకు చదువుకున్నాడు. డీఎస్సీలో సత్తా చాటడంతో అతనిని గ్రామస్థులు అభినందించారు.

శ్రమించాడు.. సాధించాడు



నక్కపల్లి: మండలంలోని గొడిచెర్ల గ్రామానికి చెందిన కర్రి రాజ నాగేశ్వరరావు ఎస్‌జీటీలో మూడవ ర్యాంకు సాధించాడు. తునిలో బైక్ సీటు కవర్ల తయారీ షాప్ పెట్టుకుని పనిచేసుకుంటూ ఖాళీ సమయంలో డీఎస్సీకి ప్రిపేర్ అయ్యేవాడు. 2015లో ఒకసారి అవకాశం కోల్పోయినా నిరాశపడకుండా శ్రమించాడు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉత్తమ ర్యాంకు సాధించాడు.

సెల్ పాయింట్ ఉద్యోగి శ్రీనుకు 38వ ర్యాంకు



రోలుగుంట: మండలంలోని కొంతలం గ్రామానికి చెందిన తగరంపూడి శ్రీను డీఎస్సీలో మంచి ప్రతిభ కనబరిచాడు. గత 8 ఏళ్లగా నర్సీపట్నం సెల్‌పాయింట్‌లో పనిచేస్తూ మరోపక్క ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని పట్టుదలతో చదువుతూ డీఎస్సీలో సోషల్‌లో (స్కూల్ అసిస్టెంట్) 77 మార్కులు పొంది జిల్లా స్థాయిలో 38 ర్యాంకు సాధించాడు. ఈయన నిరుపేద కుటుంబానికి చెందినవాడు.

డీఎస్సీలో ముగ్గురు బైలపూడి యువకుల సత్తా


గెంజి రవి


గాడి అనిల్


ఆర్.త్రినాథ్

చీడికాడ: డీఎస్సీ ఫలితాల్లో ముగ్గురు బైలపూడి యువకులు మంచి ఫలితాలు సాధించారు. ఉమ్మడి విశాఖ జిల్లా సోషల్ సబ్జెక్టులో స్కూల్ అసిస్టెంట్ పోస్టుకి గెంజి రవికి మొదటి ర్యాంకు రాగా, దాడి అనిల్‌కి 15వ ర్యాంకు, ఆర్.త్రినాథ్‌కి 25వ ర్యాంకు వచ్చింది. వీరు ముగ్గురు గ్రామానికి ఆదర్శంగా నిలిచారని గ్రామపెద్దలు అభినందించారు. ముగ్గురూ వ్యవసాయ కుటుంబంలో జన్మించినవారే. అయితే భవిష్యత్తులో గ్రూప్1, గ్రూప్2 విభాగాల్లో స్థిరపడాలని లక్ష్యంగా పెట్టుకున్నామని రవి, అనిల్, త్రినాథ్ చెప్పారు.

ఒకేసారి మూడు పోస్టులకు ఎంపిక


ఉప్పు సంతోష్


బుగత కృష్ణకుమార్

పద్మనాభం: డీఎస్సీ ఫలితాల్లో పద్మనాభం మండల యువకులు ఒకేసారి మూడు పోస్టులకు ఎంపికయ్యారు. పొట్నూరు గ్రామానికి చెందిన ఉప్పు సంతోష్ గణితం స్కూల్ అసిస్టెంటు పోస్టులో 80.57 మార్కులతో 11వ ర్యాంకు పొందాడు, పీజీటీలో 69.8 మార్కులతో 46వ ర్యాంకు, ఎస్జీటీలో 80.07 మార్కులతో 272 ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రులు కుమార్, కళావతిలు కష్టపడి చదివించడంతో 2011లో బీఈడీ చేసి ఇనేళ్ల నిరీక్షణతో అనుకున్నది సాధించాడు. ప్రస్తుతం గోస్తనీ విద్యాపీఠ్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. అలాగే మద్ది గ్రామానికి చెందిన బుగత కృష్ణకుమార్ కూడా మూడు పోస్టులకు ఎంపికయ్యాడు. స్కూల్ అసిస్టెంటు ఫిజిక్స్‌లో 75.37 మార్కులతో 14వ ర్యాంకు పొందిన కృష్ణకుమార్ టీజీటీలో 65.12 మార్కులతో 54వ ర్యాంకు, పీజీటీలో 55 మార్కులతో 69వ ర్యాంకు పొందాడు. ఎంఎస్సీ, బీఈడీ పూర్తి చేసిన కుమార్ తల్లిదండ్రులు అప్పలనాయుడు, పైడితల్లి కూలి పనులు చేసుకుని చదివించారు.

5 నుంచి వైజాగ్ ఫుడ్ ఫెస్టివల్

ఎంజీఎం గ్రౌండ్‌లో స్టాళ్లు | కలెక్టర్ హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సాగర తీరంలోని పార్కు హోటల్ వెనుక ఎంజీఎం మైదానంలో వచ్చే నెల ఐదు నుంచి ఏడో తేదీ వరకు వైజాగ్ ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ తెలిపారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర రుచులతోపాటు అంతర్జాతీయ టేస్టులతో కూడిన ఫుడ్ స్టాళ్లను ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా పర్యాటకశాఖ, హోటల్స్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ, ఈవెంట్ మేనేజర్ అసోసియేషన్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. మూడు రోజులపాటు సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు సుమారు 30 స్టాళ్లల్లో అన్ని రకాల ఆహార పదార్థాలు లభిస్తాయన్నారు. ఫుడ్ ఫెస్టివల్‌కు ప్రవేశం ఉచితమన్నారు. ఉత్తరాంధ్రలో వారసత్వంగా వచ్చే వంటలు, అంతర్జాతీయ రుచులు, ఆర్గానిక్ పంటలతో వంటకాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయన్నారు. అంతేకాక పలు సాంస్కృతిక ప్రదర్శనలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కాగా ఈ ఫుడ్ ఫెస్టివల్‌కు రూ.15 లక్షలు ఖర్చవుతుందని, పర్యాటకశాఖ రూ.ఐదు లక్షలు వెచ్చిస్తుండగా, స్పాన్సర్లు నుంచి కొంత మొత్తం, స్టాళ్ల ఏర్పాటుకు నామమాత్రం రుసుం వసూలు చేస్తామని కలెక్టర్ తెలిపారు. అనంతరం ఫుడ్ ఫెస్టివల్ వాల్ పోస్టర్‌ను కలెక్టర్, ఇతర ప్రతినిధులు ఆవిష్కరించారు.

ఏఐడీఎస్‌వో ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థుల ఆందోళన


వీసీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

విశాఖపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆల్ ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్‌వో) ఆధ్వర్యంలో శనివారం ఏయూ వీసీ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. డిగ్రీ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్న డిమాండ్‌తో ఏఐడీఎస్‌వో ఆధ్వర్యంలో చలో ఆంధ్రా యూనివర్సిటీకి పిలుపునివ్వగా, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని ర్యాలీగా వీసీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానాన్ని తొలగించాలని, మూడు సబ్జెక్టుల కాంబినేషన్‌ను పునఃప్రవేశపెట్టాలని, సీఎస్‌పీ, ఇంటర్న్‌షిప్‌లను తొలగించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏఐడీఎస్‌వో అధ్యక్షుడు కె.అభిలాశ్ మాట్లాడుతూ సింగిల్ మేజర్ సబ్జెక్ట్ విధానం వల్ల విద్యార్థులు తాము ఎంచుకుంటున్న సబ్జెక్టుపై సమగ్ర జ్ఞానాన్ని కోల్పోతున్నారన్నారు. డిగ్రీ విద్యకు అవసరమైన ఇతర అనుబంధ సబ్జెక్టులను తొలగించడంతో విద్యార్థులు పరిమితమైన జ్ఞానంతో మిగిలిపోతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐడీఎస్‌వో ఉపాధ్యక్షుడు బి.సంతోశ్, సభ్యులు చరణ్, సిద్ధు, సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన దివ్యాంగులకు పెన్షన్ తొలగింపు అన్యాయం: శాసనమండలి విపక్ష నేత 'బొత్స'


సమావేశంలో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

విశాఖపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైన దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం పెన్షన్లు తొలగించడం అన్యాయమని శాసన మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ అన్నారు. బీచ్ రోడ్డులోని తన క్యాంప్ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మ మాట్లాడుతూ పెన్షన్‌ను తొలగించడం వల్ల ఇబ్బంది పడే బాధితులకు అండగా ఉంటామని, పెన్షన్ల పునరుద్ధరణ కోసం బాధితులతో కలిసి జిల్లా కలెక్టర్లను కలిసి వినతిపత్రం అందజేస్తామని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణే వైసీపీ ధ్యేయమని, ఇందుకోసం కలిసివచ్చే పార్టీలు, మేధావులు, కార్మికులతో కలిసి రాజకీయాలకు అతీతంగా ఉద్యమిస్తామని, ఇందుకోసం త్వరలోనే కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. విశాఖ ఉక్కును అమ్మేదెవరు, కొనేదెవరని ప్రశ్నించిన కేంద్ర మంత్రి ఎక్కడున్నారంటూ రామ్మోహన్‌నాయుడిని నిలదీశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో, పాలన సాగించడంలోనూ కూటమి ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. వైసీపీ ఆవిర్భావం నుంచి రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, స్పీకర్ వంటి రాజ్యాంగబద్ధమైన పదవులకు ఎన్నిక సమయంలో సంఖ్యాబలం లేనప్పుడు పోటీ పెట్టకూడదని ఒక విధాన పరమైన నిర్ణయం తీసుకుందని, దీని ప్రకారమే తాజాగా ఉప రాష్ట్రపతి ఎన్నికలో అడుగు వేస్తామని బొత్స పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీలు కుంభా రవి బాబు, వరుదు కల్యాణి పాల్గొన్నారు.

మిలిటరీ మద్యం పట్టివేత

మల్కాపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏకేసీ కాలనీలో అక్రమంగా మిలిటరీ మద్యం సీసాలు ఉన్న కె.శ్రీనివాసరావు అనే వ్యక్తిని ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు శనివారం అరెస్ట్ చేశారు. అతని వద్ద 31 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ అధికారులు ఏకేసీ కాలనీకి వెళ్లి శ్రీనివాసరావు ఇంట్లో తనిఖీ చేయగా మిలిటరీ మద్యం సీసాలు లభ్యమయ్యాయి. వీటి విషయమై ప్రశ్నించగా నిందితుడి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో సీసాలు స్వాధీనపరుచుకొని శ్రీనివాసరావును అరెస్ట్ చేశారు. తనిఖీలలో ఎక్సైజ్ అధికారులు ఎల్.అరుణకుమారి, పి.అప్పారావు, కె.వెంకట్రావు, మహేశ్వరి, వీరభద్ర, విజయ్‌కుమార్, ఎ.దేవీచంద్ర పాల్గొన్నారు.

29 మంది పోలీసులకు పదోన్నతి

విశాఖపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్‌లో పలు విభాగాల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న 29 మందికి పదోన్నతి కల్పిస్తూ సీపీ శంఖబ్రత బాగ్చి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న 14 మందికి హెడ్ కానిస్టేబుళ్లుగా, హెచ్‌సీలుగా పనిచేస్తున్న 13 మందికి ఏఎస్‌ఐలుగా, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి లభించింది. కమిషనరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారందరికీ సీపీ సత్కరించి, పదోన్నతి ఉత్తర్వులను అందజేశారు.

ఆర్టీసీ డ్రైవర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ద్వారకాబస్‌స్టేషన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విశాఖ రీజియన్‌లో అవుట్‌సోర్సింగ్ విధానంలో డ్రైవర్లు, మెకానిక్‌ల నియామకానికి యాజమాన్యం నిర్ణయించింది. రీజియన్ పరిధిలోని ఏడు డిపోలకు సంబంధించి 80 మంది డ్రైవర్లు, 20 మంది మెకానిక్‌లను రిక్రూట్ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. డ్రైవర్ పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో కనీసం 18 నెలల అనుభవం కలిగిన ధ్రువీకరణ పత్రం సమర్పించాలని ఆర్ఎం బి.అప్పలనాయుడు తెలిపారు. మెకానిక్ పోస్టులకు సంబంధించిన అభ్యర్థులు డీజిల్ మెకానిక్ విభాగంలో ఐటీఐ చదివి ఉండాలని, సంబంధిత ట్రేడ్‌లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్హత,ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ సమీపంలోని ఆర్టీసీ డిపోలను సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 8500265355 (విశాఖపట్నం డిపో), 9492447820 (మద్దిలపాలెం డిపో), 9398177747 (వాల్తేరు), 7382921997 (గాజువాక), 81426 12140 (స్టీల్ సిటీ), 9989931179 (సింహాచలం), 9866324566 (మధురవాడ) నంబర్లకు సంప్రదించాలని కోరారు.